




తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక








ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :121 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 10, వెల. 6రూ/ గురువారం 26 ఫిబ్రవరి 2026




- జనసేన, బీజేపీతో అందుకే కలిశాం: మార్కాపురంలో చంద్రబాబునాయుడు
- మార్కాపురం జిల్లా కళ, వెలిగొండతో జలకళ, హార్టికల్చర్ రైతుల జీవితాల్లో కళకళ కార్యక్రమంలో చంద్రబాబు
- వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపుపై కలియతిరుగుతూ ప్రసంగం

## వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి

# నీరు అందిస్తాం

2

గత వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పునర్నిర్మాణం కోసం గత ఎన్నికల్లో ప్రజల సహకారం కోరానని తెలిపారు. రాష్ట్రం కోసమే జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ఆశీస్సులు అందుకున్నామని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేటుతో అఖండ విజయం కట్టబెట్టారని ఆనందం వ్యక్తం చేశారు. అరకు నుంచి ఉమ్మడి ప్రకాశం వరకు ఒక్క సీటు కూడా వైసీపీకి రాలేదని అన్నారు.'మార్కాపురం జిల్లా కళ, వెలిగొండతో జలకళ, హార్టికల్చర్ రైతుల జీవితాల్లో కళకళ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపుపై కలియతిరుగుతూ ప్రజల హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసంగించారు.

## పారిశ్రామికాభివృద్ధికి

# 'క్లస్టర్' వ్యూహం..

### ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ కీలక ప్రకటన

- క్లస్టర్ల విధానంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల గుర్తించామన్న మంత్రి లోకేశ్
- ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలకు 'నైపుణ్యం' పోర్టల్
- పరిశ్రమల భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల బలోపేతం

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసి, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం 'క్లస్టర్ బేస్డ్' విధానంతో ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సూపర్-6 హామీల్లో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై ప్రభుత్వ ప్రణాళికను ఆయన వివరించారు.

2



# దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

- నందిపల్లి గ్రామంలోని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న జగన్
- భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి వెల్లివిరుస్తుందని వ్యాఖ్య
- ఆలయ కమిటీని అభినందించిన జగన్



2

## అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి..

# రూ.6 కోట్లు సమకూర్చే బాధ్యత నాదే:

ఎస్ఎంఏ టైప్-1 అనే వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక-'ఎక్స్' వేదికగా మంత్రి లోకేశ్ సాయం కోరిన తండ్రి
ఇంజెక్షన్‌కు రూ.16 కోట్లు కావాలని, రూ.10 కోట్లు సమకూరాయన్న తండ్రి-మిగిలిన రూ.6 కోట్లు సమకూర్చే బాధ్యత తనదేనన్న మంత్రి

ఎస్ఎంఏ టైప్-1 అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. కర్నూలుకు చెందిన బాలిక పునర్విక ఈ వ్యాధితో బాధపడుతోంది. ఆమె చికిత్స కోసం మరో రూ.6 కోట్లు అవసరమని, ఆ మొత్తం అందేలా చూసే బాధ్యత తనదేనని 'ఎక్స్' వేదికగా హామీ ఇచ్చారు.తన కూతురు పునర్విక ఎస్ఎంఏ టైప్-1 వ్యాధితో బాధపడుతోందని, చికిత్స కోసం రూ.16 కోట్ల ఇంజెక్షన్ ఒక్కటే ఆప్షన్‌గా ఉందని, దాని కోసం తాము అన్ని రకాలుగా ప్రయత్నించి ప్రజల నుంచి, దాతల నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించామని, మరో రూ.6 కోట్లు అవసరమని పేర్కొంటూ పునర్విక తండ్రి మంత్రి నారా లోకేశ్‌కు 'ఎక్స్' ద్వారా విజ్ఞప్తి చేశారు.



2

# ఐ-ప్యాక్ తో ఒప్పందం కుదుర్చుకున్న అఖిలేశ్ యాదవ్

- వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు
- యోగి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా అఖిలేశ్ అడుగులు
- మమత, స్టాలిన్ సలహాలతో ఐ-ప్యాక్ తో ఒప్పందం



2

# 'నా అన్వేషణ' యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

భక్తుల మనోభావాలు దెబ్బతీశాడని పంజాగుట్ట పీఎస్‌లో కేసు నమోదు
ఫిర్యాదు చేసిన ప్రముఖ నటి కల్యాణి
తాజాగా లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు



2

# వైసీపీ పనిగట్టుకుని అబద్ధాలు ప్రచారం చేస్తోంది: - మంత్రి పార్థసారథి

గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టులు నేడు పూర్తి కావొస్తున్నాయని వెల్లడి
రాజధాని లేని రాష్ట్రం నిందను పోగొట్టి, ప్రజలు మెచ్చే రాజధానిని నిర్మిస్తున్నామన్న మంత్రి
తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యి కల్తీ జరిగిందని అందరికీ తెలిసిందన్న మంత్రి



2

# "ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు"..

### అధికారులతో సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు



ప్రజారోగ్యం విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. శ్రీకాకుళంలో విజృంభిస్తున్న డయేరియా, రాజమహేంద్రవరంలో కలకలం రేపిన కల్తీ పాల ఘటనలపై బుధవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళంలో డయేరియా బారిన పడి ప్రస్తుతం 76 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు సీఎంకు వివరించారు.జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని.. ఒకరికి వెంటిలేటర్‌పై, మరొకరికి డయాలసిస్ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా క్లీన్ డ్రింకింగ్ వాటర్ సరఫరా చేస్తున్నట్లు వివరించారు. కాగా, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా స్వయంగా పర్యవేక్షించాలని సీఎం సూచించారు.రాజమహేంద్రవరం ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. పాల శాంపిల్స్ నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మున్సిపల్, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు.

# వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తాం

వచ్చే ఎన్నికల్లో ప్రకాశం, మార్కాపురం జిల్లా అంతా కూటమిని వంద శాతం గెలిపించాలని కోరారు. 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలుకు వెళ్లాల్సిన ఇబ్బందిని తొలగిస్తూ మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నామని అన్నారు. మార్కాపురం జిల్లా మదనపల్లి జిల్లా, అలాగే పోలవరం జిల్లాను కూడా ఏర్పాటు చేశామని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలు నీరు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారని, మార్కాపురానికి మరో వరంగా వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు అందిస్తామని హామీ ఇచ్చారు.గతంలో ఈ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని, అదే ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇప్పుడు తనకు అవకాశం వచ్చిందని అన్నారు. 2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు అని వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు ఒక్క అడుగు పడలేదని అన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే 4.35 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి లాంటి నియోజకవర్గాలతో పాటు ఉదయగిరి, కడప, బద్వేలుకు కూడా నీళ్లు వెళ్తాయని అన్నారు.గతంలో తాను ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇచ్చేవాళ్లమని వెల్లడించారు. గత పాలకుడు పనులు పూర్తి అయ్యాయని దొంగ నాటకాలు ఆడారని, పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని విమర్శించారు. నిజంగానే ప్రాజెక్టు పనులు పూర్తి అయి ఉంటే ఇప్పుడు నేను రావాల్సిన అవసరమే ఉండేది కాదని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి చేస్తానని నాలుగు సార్లు సభలు పెట్టి నాలుగు తేదీలు ఇచ్చాడని అన్నారు.ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కట్ చేసి మోసం చేశాడని మాజీ ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. రూ.9081 కోట్ల నిధులు ఈ ప్రాజెక్టుకు అవసరమని, ఇప్పటి వరకు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశామని, మరో రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావని అన్నారు.గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసి బహిరంగ సభకు వచ్చానని తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని పంగ నామాలు పెట్టారని మండిపడ్డారు. ఎవరు మంచి చేస్తే వారికి అండగా నిలుస్తేనే ప్రజల జీవితాలు మెరుగవుతాయని అన్నారు.

# దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

కడప జిల్లా వేంపల్లె మండలం నందిపల్లి గ్రామంలోని నందీశ్వర ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైసీపీ అధినేత జగన్ పాల్గొన్నారు. శివ నామస్మరణతో మారుమోగుతున్న ఆలయ ప్రాంగణంలో జగన్ సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన హోమాలు, ప్రత్యేక అభిషేకాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం గావించారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... దేవాలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. "భక్తి మార్గం ద్వారానే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల పునర్నిర్మాణం జరగడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. నందిపల్లిలో ఈ మహోత్సవాన్ని ఒక పండగలా నిర్వహించడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని ఆయన ప్రశంసించారు.కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డిని, ఇతర సభ్యులను జగన్ ప్రత్యేకంగా అభినందించారు. నందీశ్వర స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం..

ఈ కొత్త విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించినట్లు లోకేశ్ తెలిపారు. రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, కడప-చిత్తూరుల్లో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్, నెల్లూరులో గ్లాస్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ వంటి క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకే చోట ప్రధాన పరిశ్రమలతో పాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పడం ద్వారా బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని వివరించారు.పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో తయారయ్యే ప్రతి 100 ఏసీలలో 50 మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయని, డైకిన్, ఎల్జీ వంటి కంపెనీలు తమకు అవసరమైన కోర్సులను ఐటీఐలలో ప్రవేశపెట్టాలని కోరాయని చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో కోర్సుల కరిక్యులమ్ మార్చి, యువతకు నాణ్యమైన శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ఎస్డీసీ, సీడాప్, న్యాక్ ద్వారా 73,000 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 40,000 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు.యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలు సులభంగా కల్పించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఒక వినూత్న పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ప్రపంచంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత టెక్నాలజీతో ఈ పోర్టల్ పనిచేస్తుందని, దీని ద్వారా యువత తమ నైపుణ్యాలను స్వయంగా అంచనా వేసుకోవచ్చని, రెస్యూమ్ తయారు చేసుకోవచ్చని, ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకోవచ్చని వివరించారు. ఏఐ ట్యూటర్ ద్వారా ఇంటర్వ్యూలకు కూడా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.ప్రతి నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటివరకు నిర్వహించిన 1,587 జాబ్ మేళాల ద్వారా 1,08,747 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో ప్రపంచస్థాయి కార్మికులను తయారు చేసేందుకు న్యాక్‌ను 90 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన బలోపేతం చేస్తామని మంత్రి లోకేశ్ సభకు హామీ ఇచ్చారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేసి ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించడమే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

# 'నా అన్వేషణ' యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

'నా అన్వేషణ' యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అతడు వీడియో విడుదల చేశాడంటూ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి పంజాగుట్ట పోలీసులు ఈ నోటీసులు జారీ చేశారు.విశాఖపట్నంకు చెందిన అన్వేష్ విదేశాల్లో ఉంటూ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అతడు కొద్ది రోజుల క్రితం వీడియోను విడుదల చేశాడు. ఈ క్రమంలో ప్రముఖ సినీ నటి కరాటే కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తాజాగా లుకౌట్ నోటీసులు జారీ చేశారు.వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఇటీవల అన్వేష్ అకౌంట్‌ను ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేసింది. తన ఖాతాను ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేయడాన్ని అన్వేష్ తేలిగ్గా తీసుకున్నాడు. తనకు యూట్యూబ్ ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు వస్తున్నాయని ఈ ఖాతా పోతే తనకు వచ్చే నష్టమేమీ లేదని తెలిపాడు. ఆయన మరో ఇన్‌స్టాగ్రామ్ ఖాతాతో పాటు యూట్యూబ్‌ను కూడా బ్లాక్ చేయాలని పోలీసులు లేఖ రాయనున్నారు.

# ఐ-ప్యాక్ తో ఒప్పందం కుదుర్చుకున్న అఖిలేశ్ యాదవ్

భారత రాజకీయాల్లో కీలకమైన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2027 ప్రారంభంలో జరగనున్నాయి. కానీ, అప్పుడే ఆ రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలయింది. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన యూపీలో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ భారీ స్కెచ్ వేశారు. వరుసగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌ను గద్దె దించడమే లక్ష్యంగా... దేశంలోనే అత్యంత విజయవంతమైన రాజకీయ వ్యూహకర్తల సంస్థ 'ఐ-ప్యాక్' తో అఖిలేశ్ ఒప్పందం కుదుర్చుకున్నారు.

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ ఇచ్చిన సూచన మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు. ఐ-ప్యాక్ వ్యూహాలతోనే బెంగాల్‌లో టీఎంసీ, తమిళనాడులో డీఎంకే విజయాలు సాధించిన నేపథ్యంలో, అదే ఫార్ములాను యూపీలోనూ వర్తింపజేయాలని ఆయన నిర్ణయించారు. పార్టీ ప్రచారాన్ని కేవలం పట్టణాలకే పరిమితం చేయకుండా జిల్లా, బూత్ స్థాయి వరకు బలంగా తీసుకువెళ్లే బాధ్యతను ఐ-ప్యాక్‌కు అప్పగించారు.

# వైసీపీ పనిగట్టుకుని అబద్ధాలు ప్రచారం చేస్తోంది:

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే ఆ విషయాన్ని తట్టుకోలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పనిగట్టుకుని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోకి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని అన్నారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులు నేడు పూర్తికావస్తున్నాయని అన్నారు. రాజధాని లేని రాష్ట్రం అనే నిందను పోగొట్టి, ప్రజలందరూ మెచ్చే రాజధానిని నిర్మిస్తుంటే ప్రజల దృష్టిని మరల్చడానికి సాక్షి టీవీ, పేపర్లను వాడుకుని వైసీపీ నాయకులు సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యి కల్తీ జరిగిందనే విషయం చిన్నా పెద్దా అందరికీ తెలిసిపోయిందని అన్నారు.పామాయిల్, కెమికల్స్ వాడి నెయ్యిని అపవిత్రం చేసిన విషయం సిట్ (సిట్), సీబీఐ విచారణల్లో తేలిందని అన్నారు. ఇంత పాపం చేసినా భయం లేకుండా వైసీపీ నేతలు ఎదురుదాడి చేయడం దారుణమని మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డికి, వారి ముఖ్య నాయకులకు హిందూ సంప్రదాయాల మీద గానీ, దేవుడి మీద గానీ కనీస భక్తి లేకపోవడమే దీనికి కారణమని ఆరోపించారు. మీ దగ్గర నిజం ఉంటే, ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ చేశారు.

వారి మాటల్లో నిజం లేదు కాబట్టే అసెంబ్లీకి రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని 'ఎక్స్' ద్వారా, సొంత మీడియా ద్వారా విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మీరు రేపు ప్రజల్లోకి వెళ్లి పోటీ చేసే పరిస్థితి కూడా లేదని, కేవలం తాడేపల్లి కుర్చీల కోసమే మీరు కొట్టుకుంటారని విమర్శించారు. నెయ్యి సేకరణపై కూడా వైసీపీ నేతలు అజ్ఞానంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నందిని డైరీకి 40 లక్షల లీటర్ల ఆర్డర్ ఇచ్చామని, మొత్తం నెయ్యి అవసరంలో 62 శాతం నందిని, మదర్ డైరీల నుంచే సేకరిస్తున్నామని అన్నారు. మిగిలిన టెండర్లు ఇందాపూర్, సంఘం డైరీలకు దక్కాయని వెల్లడించారు. ఎన్డీడీబీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ ఉన్న ల్యాబొరేటరీల పరీక్షల తర్వాతే నెయ్యిని అనుమతిస్తున్నామని అన్నారు. పదేళ్ల క్రితం ఉన్న ధరలకే ఇప్పుడు కూడా నెయ్యి రావాలని కోరడం మీ తెలివితక్కువతనానికి నిదర్శనమని విమర్శించారు. మీ భారతీ సిమెంట్ వంటి ఇతర వస్తువుల ధరలు పెరిగినట్టే, నెయ్యి ధరలు కూడా పెరుగుతాయని తెలియదా? అని ప్రశ్నించారు.

"కల్తీ నెయ్యి తినడం వల్ల మీకు బుద్ధిమాంద్యం వచ్చిందేమో అనిపిస్తోంది. భక్తుల నమ్మకాన్ని కాపాడటం కోసం భవిష్యత్తులో ఎటువంటి కల్తీకి తావులేకుండా టీటీడీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన 'స్టేట్ ఆఫ్ ఆర్ట్' ల్యాబొరేటరీని ఏర్పాటు చేశాం. ఇప్పుడు ప్రతి ట్రక్కు నెయ్యిని క్షుణ్ణంగా పరీక్షించిన తర్వాతే లడ్డూ తయారీకి అనుమతిస్తున్నాం. భక్తుల నమ్మకాన్ని కాపాడటమే మా ప్రభుత్వ లక్ష్యం. రాజశేఖర్ రెడ్డి గారు ఏడుకొండలను దివ్యక్షేత్రంగా చేశారని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ నేతలు అసలు విషయాన్ని దాచేశారు. 2005లో జీవో నెంబర్ 338 ద్వారా తిరుమల పరిధిని కేవలం రెండు కొండలకే పరిమితం చేయాలని చూసింది వాస్తవం కాదా?" అని నిలదీశారు.అప్పట్లో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో హిందూ సంఘాలు, తెలుగుదేశం పార్టీ పోరాటం చేయడం వల్లే, దిగివచ్చిన నాటి ప్రభుత్వం 2007లో మళ్ళీ ఏడుకొండలను కలుపుతూ జీవో ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ చరిత్రను ప్రజలు మర్చిపోలేదని అన్నారు. హెరిటేజ్ గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదని అన్నారు. హెరిటేజ్ సంస్థ నాణ్యత విషయంలో ఎంత కఠినంగా ఉంటుందో చెప్పడానికి తన జీవితంలో జరిగిన ఒక సంఘటనే ఉదాహరణ అన్నారు.గతంలో తనకు పాలు ప్యాకింగ్ చేసే 'ఫిలిం' ఫ్యాక్టరీ ఉండేదని, తాను అప్పుడు కాంగ్రెస్ పార్టీలో ముఖ్య నాయకుడిగా ఉన్నప్పటికీ, తన కంపెనీ నాణ్యతను చూసి హెరిటేజ్ వారు ఆర్డర్లు ఇచ్చారని వెల్లడించారు. కానీ ఒకరోజు వారి అధికారి మా ఫ్యాక్టరీకి వచ్చినప్పుడు అక్కడ కొన్ని దోమలు, పురుగులు ఉండటం గమనించి వెంటనే ఆర్డర్లు రద్దు చేశారని అన్నారు. క్వాలిటీ విషయంలో కొంచెం తేడా వచ్చినా వారు రాజీపడరని తెలిపారు.తాను ప్రతిపక్షంలో ఉన్నానని కాదని, క్వాలిటీ లేదని ఆర్డర్ తీసేశారని అన్నారు. అదీ ఆ సంస్థ పాటించే నిబద్ధత అని వెల్లడించారు. ఇందాపూర్ డైరీపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఫెన్స్ ఆయుధాలు తయారు చేసే సంస్థలైనా, ఎయిర్ బస్ అయినా, బీహెచ్ఎల్ అయినా అన్నీ తమ సొంత కంపెనీలోనే తయారు చేయవని పేర్కొన్నారు. వివిధ కంపెనీల నుండి కాంపోనెంట్స్ తీసుకుని అసెంబుల్ చేస్తాయని తెలిపారు. అలాగే హెరిటేజ్ సంస్థ ఇందాపూర్ నుండి చీజ్ కొంటే తప్పేమిటని ప్రశ్నించారు.

"ఇందాపూర్ అనేది దేశంలోనే అతిపెద్ద డైరీ. ఇది అమూల్, బ్రిటానియా, మదర్ డైరీ వంటి దిగ్గజాలకు ఉత్పత్తులను సరఫరా చేస్తుంది. అటువంటి సంస్థకు అపవిత్రత ఆపాదిస్తారా? అటువంటి ప్రతిష్ఠాత్మక సంస్థపై కూడా బురద చల్లడం వైసీపీ నాయకుల కుసంస్కారానికి నిదర్శనం.

భూమన కరుణాకర్ రెడ్డి గారు ఇప్పుడు పట్టు పంచెలు కట్టి, నామాలు పెట్టుకుని నాటకాలు ఆడుతున్నారు. గతంలో ఆయన 'ఏడుకొండల వాడు కేవలం ఒక నల్లరాయి' అని, ఆ రాయిని చెప్పుతో కొడితే ఏమవుతుందని అన్న మాటలు సోషల్ మీడియాలో సాక్ష్యాలతో ఉన్నాయి. ఆర్ఎస్‌యూ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన ప్రచారం చేసిన నాస్తికత్వాన్ని ప్రజలు గుర్తించారు. భగవంతుడిపై నమ్మకం లేని ఇలాంటి వ్యక్తుల చేతుల్లో తిరుమల పవిత్రత ఎలా కాపాడబడుతుందని భావించారు? చేసిన పాపానికి భగవంతుడి దగ్గర క్షమాపణ కోరాల్సింది పోయి, ఎదురుదాడి చేయడం మీ అహంకారానికి నిదర్శనం. ఇప్పటికైనా అబద్ధాలు మానుకొని, హిందూ మనోభావాలను గౌరవించడం నేర్చుకోండి" అని అన్నారు.ఆనాడు పర్చేస్ కమిటీలో ఉన్నప్పుడు మేము చెప్పింది ఒక్కటేనని, పోటీని పెంచాలని, ఆవు నెయ్యి సరఫరా చేసే వారిని ఎక్కువ మందిని రప్పించండని సూచించామని అన్నారు. అంతే కానీ, కల్తీ నెయ్యిని, పామాయిల్ నెయ్యిని కొనమని మేము ఎప్పుడూ చెప్పలేదని తెలిపారు. మంచి మాటల్లో నుంచి కూడా చెడును వెతకడం వైసీపీ నేతలకే చెల్లిందని అన్నారు. ఆవు నెయ్యి ముసుగులో పామాయిల్, కెమికల్స్ వాడి భక్తుల మనోభావాలతో ఆడుకున్నది మీరు కాదా అని వైసీపీ నేతలను ఉద్దేశించి ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి వేరే మతాన్ని నమ్మవచ్చు, అది ఆయన ఇష్టమని స్పష్టం చేశారు. భారతీయ సంస్కృతి ప్రకారం ప్రతి మతాన్ని మనం గౌరవిస్తామని, కానీ ఇతర మతస్తుల నమ్మకాలను, హిందూ దేవుళ్ల పవిత్రతను అగౌరవపరచడం సరైంది కాదని హితవు పలికారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని, ప్రజాస్వామ్యంపై నమ్మకంతో ప్రవర్తించాలని సూచించారు

# అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి.. రూ.6 కోట్లు సమకూర్చే బాధ్యత నాదే:

ఈ విజ్ఞప్తిపై నారా లోకేశ్ స్పందించారు.ఎస్ఎంఏ టైప్-1 అనేది అరుదైన వ్యాధి అని, దీనితో కండరాలు బలహీనపడతాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి స్థితిలోనూ పునర్వికా పోరాడుతున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె నిజంగా ధైర్యవంతురాలని ప్రశంసించారు. అసాధారణ ధైర్యంతో వ్యాధితో పోరాటం చేస్తోందని అన్నారు.ఆమె ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమని, దాతల నుంచి రూ.10 కోట్లు సమకూరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పునర్వికా ఇంజెక్షన్ కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఆమె చికిత్స కోసం మిగిలిన రూ.6 కోట్లు అందేలా చూసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. సహాయం చేయాలంటూ తన కార్యాలయ 'ఎక్స్' ఖాతాకు అటాచ్ చేశారు. పునర్వికకు సహాయం చేయడానికి మరింతమంది ముందుకు రావాలని కోరారు.

# రజక కుటుంబంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి..

## -ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం...

జహీరాబాద్



రాష్ట్రంలో పెత్తందారులు బీసీ లపై దాడులు విధ్వంసాలకు పాల్పడటం దారుణం,నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రజక దంపతులు స్వామి వారి దర్శనం కోసం గుడిలోకి ప్రవేశించగా ఆరజకులపై దాడి చేయడం దుర్మార్గపు చర్య,కుటుంబ సభ్యులు దాడి జరపొద్దని,బాధితులు పెత్తందారుల కాళ్లపై పడి దండం పెట్టిన కనికరించని ఆ పెత్తందారులు బిడ్డను కాళ్లతో తన్ని విసిరేయడంతో పసి బిడ్డ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి మరణించడం అత్యంత బాధాకరం ఈ విదంగా పెత్తందారులు కృరంగా కిరాతకంగా మానవత్వానికి మచ్చ తెచ్చేవిదంగా దౌర్జన్యం చేయడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థం అవుతున్నది,ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని పసిపాప హత్యకు కారణమైన దోషులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం డిమాండ్ చేశారు.

విజేత

గురువారం 26 ఫిబ్రవరి 2026





# పైప్‌లైన్ లీక్‌తో కాలనీకి తాగునీటి సంక్షోభం

## చెత్తబురదగా మారిన రహదారి పంచాయతీ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

విజేత దేవరపల్లి:
దేవరపల్లి మండలం యాదవోలు రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద జల జీవన్ మిషన్ ద్వారా చంద్రబాబు నాయుడు కాలనీలోకి సరఫరా అవుతున్న మంచినీటి పైప్‌లైన్ లీక్ అవ్వడంతో కాలనీవాసులకు సరైన తాగునీటి సరఫరా అందడం లేదు. పైప్ చిట్లిపోవడంతో నీరు నిరంతరం వృథాగా పారిపోతుండగా, సమస్యను పరిష్కరించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.లీకేజీ కారణంగా రోడ్డుపై నీరు నిల్వవడంతో దొడ్లు బురదమయంగా మారాయి. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు జారి పడే ప్రమాదం ఉందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. తాగునీటి సమస్యతో పాటు రహదారి దుర్వస్థితి ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది.ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ లీక్‌ను మరమ్మతు చేసి కాలనీకి నిరంతర మంచినీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారిపై నిల్వ నీటిని తొలగించి ప్రయాణానికి అనుకూలంగా మారుస్తామని గ్రామస్తులు కోరుతున్నారు



# ఎస్ టి యు మహాధర్నాకు తరలి వెళ్లిన ఉపాధ్యాయులు

విజేత దేవరపల్లి :
ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పిఆర్సి ఏర్పాటు కొరకు ఆర్థిక బిల్లులు మరియు సిపిఎస్ రద్దు కొరకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ పిలుపుమేరకు విజయవాడలో జరగనున్న మహాధర్నాకు దేవరపల్లి మండలం చెందిన ఉపాధ్యాయులు కూడా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యోగులకు చెందిన ఆర్థిక, ఆర్థికేతర అంశాలను నెరవేర్చమని రాష్ట్ర వ్యాప్తంగా 20 వేలకు పైగా ఉపాధ్యాయులు మహా ధర్నా లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ టి యు రాష్ట్ర కౌన్సిలర్ దొడ్డ శ్రీ కృష్ణ,జిల్లా కార్యదర్శి కిరణ్ కుమార్, దేవరపల్లి అధ్యక్షులు కాటం బాబు ప్రధాన కార్యదర్శి సిరిశెట్టి ఈశ్వరరావు. ఆర్థిక కార్యదర్శి షేక్ బాషా, ఉపాధ్యక్షులు దేవిప్రసాద్, మహిళా కౌన్సిలర్ సత్యవతి కార్యదర్శి దేవి, ధనలక్ష్మి మరియు మండల ఉపాధ్యాయలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# గుంజి సూరి గృహప్రవేశ మహోత్సవం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రధాత మండలనేని చరణ్ తేజ

విజేత చిలకలూరిపేట:

పట్టణంలోని 26వ వార్డులో నివాసం ఉంటున్న గుంజి సూరి నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సామాజిక కార్యకర్త, ప్రధాత, నియోజకవర్గం యువ నాయకులు మండలనేని చరణ్ తేజ విచ్చేశారు.నూతన గృహంలో అడుగుపెట్టిన సూరి కుటుంబ సభ్యులకు చరణ్ తేజ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి సొంతింటి కలను నిజం చేసుకోవడం అభినందనీయమని, ఆ కొత్త ఇంట్లో ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట జనసేన పార్టీ ఇంచార్జి తోట రాజా రమేష్, పట్టణ అధ్యక్షులు మునిర్ హాసన్ వార్డు ప్రముఖులు, బంధుమిత్రులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని

# చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనమైన మూడు గ్రామాల గురించి శాసనమండలిలో చర్చించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ..

విజేత చిలకలూరిపేట మున్సిపల్ ఎన్నికలకు ముందు చిలకలూరిపేట కొన్ని గ్రామాలను మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకువచ్చారు. అవి మూడు గ్రామాలు పసుమర్రు,మానుకొండవారిపాలెం,గణపవరం. ఈ గ్రామాలను మున్సిపాలిటీలో కలిపిన తర్వాత కొంతమంది మున్సిపాలిటీలో కలపడానికి వీల్లేదని కోర్టుకు వెళ్లారు. కోర్టుకు వెళ్లిన తర్వాత ఎన్నికలు జరిగినాయి.ఎన్నికలు మాత్రం మున్సిపాలిటీ వాళ్లు ఆ గ్రామాలను కలుపుకొని ఎన్నికలు జరిపారు. అక్కడినుండి కౌన్సిలర్లు కొంతమంది ఎన్నికయ్యారు. గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో మున్సిపాలిటీ ఏ ఆర్థిక నిధులు ఆ గ్రామాలకు ఇవ్వలేదు. కారణం ఏమిటంటే అవి పంచాయతీలు గానే ఉన్నాయి ఇంకా పూర్తిగా మున్సిపాలిటీలో కలవలేదు హైకోర్టులో రిట్ పెండింగ్ ఉందని మున్సిపాలిటీ వారు అంటారు. పంచాయతీ వారేమో మేము ఎన్నికలు జరపలేదు మున్సిపాలిటీ వారు ఎన్నికల జరపమన్నారు కౌన్సిలర్లు గా కూడా ఎన్నికయ్యారు. కాబట్టి మున్సిపల్ పరిపాలన జరుగుతుంది కాబట్టి మేము పంచాయతీ నిధులు ఇవ్వమని వారు చెప్తున్నారు. పంచాయతీలకు వచ్చే ఆర్థిక నిధులు వాటికి రావు,అలాగే మున్సిపాలిటీ కి వచ్చే ఆర్థిక నిధులు కూడా ఆ గ్రామాలకు పోవు. ఈ రకంగా ఏ రకంగా అభివృద్ధి జరగకుండా గడిచిన ఐదు సంవత్సరాలు ఏ రకమైన నిధులు రాక అభివృద్ధి జరగక ఆ గ్రామాల కు చాలా నష్టం జరిగింది. ప్రభుత్వం వారు ఇకనైనా ఇక్కడ ఎలా అయితే స్పెషల్ మెన్షన్ వేస్తామో అలాగే అక్కడ ఆ కోర్టులో కూడా స్పెషల్ మెన్షన్ వేసి ఆ కేసులు విచారణకు తీసుకువచ్చి వాటిని త్వరగా



పరిష్కరించి అవి మున్సిపల్ పరిధిలో ఉంటాయా లేక గ్రామ పంచాయతీల పరిధిలోకి పంపిస్తారా అనేది పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకొని ఆ గ్రామాలు నిధులు మంజూరు చేసి అభివృద్ధి జరిగేలాగా సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నకు విజ్ఞాపన చేశారు

# బుట్టాయగూడెం తహసీల్దార్ చలపతిరావు పై చర్యలు తీసుకోండి - రెవెన్యూ ఉద్యోగులు.



విజేత . బుట్టాయగూడెం .
బుట్టాయగూడెం తహసీల్దార్ చలపతిరావు పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఉద్యోగులు డిమాండ్ చేశారు. చలపతిరావుపై స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసి, అనంతరం మండల రెవిన్యూ కార్యాలయం వద్ద పాత్రికేయులతో తమ గోడును వెళ్ళబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ తమతో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని , సంతకాల కోసం వెళితే మహిళలని చూడకుండా గంటల కొద్ది నిలబడే ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిండు గర్భిణి అని కూడా చూడకుండా ఒక మహిళా ఉద్యోగిని సైతం వేధిస్తున్నారని అన్నారు. కులం పేరుతో దూషిస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని రెవెన్యూ ఉద్యోగులు ఆరోపించారు. మీరు ఇక్కడ తప్ప ఎక్కడ పనిచేయలేరని, శుద్ధ మొద్దులని , మీకు తినడం తప్పా , పనిచేయడం చేతకాదని ప్రతిరోజు వేధించే వారిని ఉద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాహసీల్దార్ చలపతిరావు పై ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, విధుల నుండి తొలగించవలసిందిగా రెవెన్యూ ఉద్యోగులు అధికారులకు విజ్ఞప్తి చేశారు

# యువ రాజకీయాలతో నవభారత నిర్మాణం సాధ్యం.. -ప్రిన్సిపల్ భారత్ కుమార్ నాయక్

విజేత అరకు లోయ.
యువరాజకీయాలతో నవభారత నిర్మాణం సులభతరం కావడమే కాకుండా అసాధ్యాన్ని సాధ్యం చేసి నిరూపించవచ్చని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే భరత్ కుమార్ నాయక్ అన్నారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోని మై భారత్ వికాషిత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ భరత కుమార్ నాయక్ మాట్లాడుతూ యువతలో రాజకీయ నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా కృషి చేస్తుందన్నారు. యూత్ పార్లమెంట్ నిర్వహణ యువతీ యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, నేటి యువత రాజకీయాల్లోకి అడుగుపెడితే యువభారతం వర్ధిల్లుతుందని నవ భారతం సాధ్యపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా మన్య ప్రాంతంలో యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహణ గిరి పుత్రులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలియజేశారు. ఇండియాకు చెందిన నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ స్కూల్ చైర్మన్ ఎన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో కేంద్రం నిర్వహిస్తున్న మై భారత్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగపరచుకొని అందుకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని ఆయన తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన వారు జాతీయస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్త న్యాయవాది



బి రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అధికారులు విజయలక్ష్మి, పి నాగబాబు, ఎం అనిత కుమారి పాల్గొన్నారు. కాగా మై భారత్ యువజన పోటీలకు ఆయనిర్ణేతలగా ఎన్ నాగేశ్వరరావు, బి రామకృష్ణ, గణేష్, వెంకటరమణ, నాగబాబు వ్యవహరించారు. మై భారత్ కార్యక్రమంలో పాడేరు, అరకు, చింతపల్లి ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం - సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్ మని లాల్

ఏరేపల్లె ...
అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలి లేని నేపథ్యంలో మరో పోరాటం తప్పదు...రేపల్లె ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద అంగన్వాడీలా రిలే నిరాహారదీక్షలులో సీఐటీయూ బాపట్ల జిల్లా కోశాధికారి సీహెచ్. మణిలాల్ డిమాండ్‌లి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటియుసి) సంఘాల ఉమ్మడి పిలుపు మేరకు రేపల్లె ప్రాజెక్ట్ కార్యాలయంలో వద్ద సిఐటియు, ఏఐటియుసిగా రెండో రోజు రిలే నిరాహారదీక్షలు కొనసాగినవి,ఈ దీక్షలను ఉద్దేశించి సిఐటియు బాపట్ల జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్ మరియు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కే.ఝాన్సీ మాట్లాడుతూ చిరు ఉద్యోగులుగా ఉన్న అంగన్వాడీలా సమస్యలు పరిష్కారం చేయటంలో ప్రభుత్వం విఫలం, వేతనాలు పెంపుదల చేస్తామని ఇచ్చినా హామీ అమలుచేయాలి,సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అమలు చేయాలి,వేసవి మే నెల మొత్తం సెలవులు ఇతర రాష్ట్రాల్లో లాగా అమలు చేయాలి,అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ఫీడింగ్ క్వాలిటీ పెంచాలి, ఆన్లైన్లో పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు,ఎన్నో ఆశలతో ఈ ప్రభుత్వం పై మహిళలు నమ్మకం పెట్టుకున్నప్పటికీ మహిళా పక్షపాతి ప్రభుత్వం అనే మాటలు చెప్పుకుంటూ మహిళలను రోడ్డు మీద పడేశారు అని విమర్శించారు,మార్చి 2 విజయవాడలో మహాధర్నా తలపెడుతున్నట్లు పిలుపు ఇచ్చారు,ఈ రిలే నిరాహార దీక్షలుకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ జిల్లా నాయకులు ఏంవి.సుబ్రమణ్యం, కే.శాంతరావు లు మద్దతు తెలిపారు,ఈ కార్యక్రమంలో సిఐటియు,ఏఐటియుసి అనుబంధ సంఘాల అంగన్వాడీ వర్కర్స్ నాయకులు ఎస్.నిర్మల జ్యోతి,ఎన్ కృష్ణకుమారి,డి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు



# రోడ్ల నిర్మాణంపై గత పాలకుల నిర్లక్ష్యం.. 43 వేల ప్రాణాలు బలిగొంది : ప్రత్తిపాటి

**- గత ప్రభుత్వంలో ఐదేళ్లలో 1,15,000 రోడ్డు ప్రమాదాలు జరిగాయి.- రోడ్ల అభివృద్ధికి గతపాలకులు మొక్కుబడిగా రూ.10కోట్లు కేటాయించారు.**

**- అమరావతి అనంతపురం ఎక్స్ ప్రెస్ వేసహా రాష్ట్రంలోని ప్రధాన రోడ్లను గాలికి వదిలేశారు.- కూటమిప్రభుత్వం వచ్చిన 9 నెలల్లోనే రాష్ట్రంలోని రోడ్లను గుంతలరహితంగా మార్చింది.**

**- తాజా బడ్జెట్లో రోడ్ల అభివృద్ధికి రూ.9,900 కోట్లు కేటాయించి.. ప్రజాభద్రతకు అత్యధిక ప్రాధాన్యమిచ్చింది.**

**-చిలకలూరిపేట-నరసరావుపేట రోడ్డు విస్తరణ చేపట్టాలి.- ఎన్ హెచ్ 16 బైపాస్ మొత్తం పూర్తయితేనే ప్రజల సమస్యలు తీరతాయి.**

**- జాతీయ రహదారి 167 ఏ నిర్మాణ టెండర్లు పిలిచారు.. పనులు ప్రారంభించలేదు.-శాసనసభలో మాజీమంత్రి ప్రత్తిపాటి.**

విజేత చిలకలూరిపేట

గత పాలకులు గుంతలమయంగా మార్చిన రాష్ట్ర రోడ్లను కూటమిప్రభుత్వం కేవలం 9 నెలల్లోనే గుంతలరహితంగా తీర్చిదిద్దిందని, తాజా బడ్జెట్ లో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.9,900 కోట్లు కేటాయించిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారుబుధవారం అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్ & బీ రోడ్ల దుస్థితి ప్రజల కష్టాలు అనే అంశంపై ప్రత్తిపాటి మాట్లాడారు. గత ప్రభుత్వపాలనలో ఐదేళ్లలో 1,15,000 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, 43వేల మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, ఇంత ప్రాణనష్టం జరిగినా నాటి పాలకులు రహదారుల నిర్మాణానికి కేవలం రూ.10 కోట్లే కేటాయించి చేతులు దులుపుకున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 6,534 కిలోమీటర్ల మేర కొత్త రహదారుల నిర్మాణానికి ఏఐఐబీతో చేసుకున్న ఒప్పందాన్ని కూడా జగన్ రద్దు చేశారని చెప్పారు. అమరావతి అనంతపురం ఎక్స్ ప్రెస్ వే, అమరావతి రింగ్ రోడ్ నిర్మాణం సహా రాష్ట్రంలో దెబ్బతిన్న 30 వేల కిలోమీటర్ల రహదారుల దుస్థితికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కూటమి ప్రభుత్వం వచ్చాకే రోడ్లకు మహర్దశ..**

కూటమిప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలోని రోడ్లకు మహర్దశ వచ్చిందని, చంద్రబాబు నాయకత్వంలో రోడ్లు బాగా నిర్మిస్తారని ప్రజల్లో నానుడి ఉందని, ఈ పరిస్థితుల్లో నిధుల కొరత ఉన్నా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల నిర్మాణం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. చంద్రబాబు కృషితో రాష్ట్రంలో రూ.70వేల కోట్లకు పైగా హైవేపనులు జరుగుతున్నాయన్నారు. బడ్జెట్ లో కేటాయింపులు చూస్తే రాష్ట్రంలో ఎక్కడా గుంతలనేవి లేకుండా రోడ్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయనే నమ్మకం ఏర్పడుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ప్రధాన మార్గాలైన రోడ్ల నిర్మాణంపై కూటమిప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు.

**అధిక లోడు వాహనాలు తిరిగే రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక డీపీఆర్‌లు**

భారీ బరువులు ఉన్న వాహనాలు తిరిగే మార్గాల్లోనే ఎక్కువగా రోడ్లు దెబ్బతింటున్నాయని, అధిక లోడు వల్ల కొత్త రోడ్లు వెంటనే పాడైపోతున్నాయని ప్రత్తిపాటి తెలిపారు. అందువల్ల అటువంటి వాహనాలు తిరిగే రోడ్లు రెట్టింపు నాణ్యతతో, అధిక లోడును తట్టుకునేలా నిర్మించాలని ప్రత్తిపాటి సూచించారు. ఆ విధమైన రోడ్ల నిర్మాణ వ్యాల్యుయేషన్ ను కూడా పెంచాలన్నారు. ఆ విధమైన రోడ్లను ప్రత్యేక కేటగిరీగా విభజించి, వాటి నిర్మాణానికి ప్రత్యేక డీపీ ఆర్ లు తయారుచేస్తే బాగుంటుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై రహదారులు భవనాల శాఖ మంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

**ఎన్ హెచ్ 167ఏ టెండర్లు పిలిచారు.. పనులు ప్రారంభం కాలేదు**

చిలకలూరిపేట నియోజకవర్గంలో పలు ప్రధాన రోడ్లను విస్తరించాల్సి ఉందని, పెరిగిన ట్రాఫిక్ సమస్యల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ప్రజల ప్రాణాల భద్రతకు ప్రాధాన్యమివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, తనపై ఉందన్నారు. చిలకలూరిపేట నరసరావుపేట రోడ్లు విస్తరణ



చేపట్టాలని, ఎత్తుకూడా పెంచాలని సూచించారు. ఎన్.హెచ్ 167 ఏ నిర్మాణానికి టెండర్లు పిలిచి ఇంకా పనులు ప్రారంభించలేదని, భూసేకరణకు సంబంధించిన పరిహారం ఇంకా అందలేదని, సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రత్తిపాటి సభాముఖంగా ప్రభుత్వాన్ని కోరారు.

**చౌడవరం కొండవీడు రోడ్డుకు ముఖ్యమంత్రి కూడా సుముఖత వ్యక్తంచేశారు**

2019 ఫిబ్రవరిలో నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు చౌడవరం (ఎన్ హెచ్-16) నుంచి ప్రఖ్యాత పర్యాటక కేంద్రం కొండవీడు కోటకు 5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారని ప్రత్తిపాటి చెప్పారు. కొండవీడు కోట ఘాట్ రోడ్డును అనుసంధానించే ఈ రోడ్డు నిర్మాణం యొక్క ఆవశ్యకతను గుర్తించి ప్రభుత్వం వెంటనే దీన్ని పూర్తిచేయాలని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్డు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, ఆయన కూడా సుముఖత వ్యక్తం చేశారని ప్రత్తిపాటి తెలిపారు. అలానే నియోజకవర్గంలోని సింగిల్ లైన్ రోడ్లను డబుల్ లైన్లుగా మార్చాలన్నారు. చిలకలూరిపేట కోటప్పకొండ (వయా నరసరావుపేట) మార్గంలో అధిక ట్రాఫిక్ ఉంటోందని, ముఖ్యంగా శివరాత్రి తిరునాళ్ల సందర్భంలో ఊహించని విధంగా ప్రజల తాకిడి ఉంటుందని, ఈ నేపథ్యంలో ఈ రోడ్డు విస్తరణపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలన్నారు. ఓగేరు నుంచి గణవపరం బ్రిడ్జి వరకు వాగుపై రెండువైపులా నిర్మించాల్సిన డ్రెయిన్ల నిర్మాణం కూడా పెండింగ్ లో ఉందని ప్రత్తిపాటి సభద్వారా ప్రభుత్వానికి తెలియచేశారు. చిలకలూరిపేట వేలూరు మధ్య వరద తాకిడితో అధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తిచేయాలన్నారు.

**ఎన్ హెచ్ 16 బైపాస్.. మొత్తం పూర్తయితేనే సమస్యలు తీరతాయి..**

2014-19లో కేటాయించబడిన ఎన్ హెచ్ 16 జాతీయ రహదారి బైపాస్ నిర్మాణం పూర్తైందికానీ.. అనుబంధంగా ఉన్న సర్వీస్ రోడ్లు, అండర్ పాసులు పూర్తి చేయాల్సి ఉందని ప్రత్తిపాటి తెలిపారు. భారత్ మాల పరియోజన కింద హైబ్రీడ్ యాన్యుటీ మోడ్ లో చేపట్టిన ఎన్.హెచ్ 16 బైపాస్ యొక్క నిర్మాణాన్ని సంపూర్ణం చేయాలని, అప్పుడే ప్రజల సమస్యలు తీరతాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. బైపాస్ నిర్మాణంలోని లోపాల వల్ల పట్టణంలోని కొన్ని ప్రాంతాలు నీటమునుగుతున్నాయన్నారు. అన్నింటికంటే ముందు జాతీయ రహదారి విస్తరణకు భూములిచ్చిన రైతులకు తక్షణమే న్యాయం జరిగేలా చూడాలని ప్రత్తిపాటి సభద్వారా ప్రభుత్వాన్ని కోరారు

## నూతన సిమెంట్ రోడ్లు నిర్మాణాలు

# మూన్నాళ్ళ ముచ్చటైన?

**-నెల రోజులు కూడా నిలవని సీసీ రోడ్లు - నాణ్యతా లోపాలపై స్థానికుల ఆగ్రహం**

**- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు**

విజేత దేవరపల్లి ;

దేవరపల్లి మండల పరిధిలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లు నెల రోజులు పూర్తికాకముందే బీటలు వారడం స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. భారీ వ్యయంతో నిర్మించిన రోడ్లు ప్రారంభ దశలోనే పాడైపోవడం వల్ల ప్రభుత్వ నిధుల వృథా జరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల ఆరోపణల ప్రకారం గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా పనులు నిర్వహించారు. రోడ్లకు సరైన స్థాయి కాంక్రీట్ మిశ్రమం ఉపయోగించలేదని, అవసరమైన మందం ¯(ష్ట్రఱఓఅవంం) కూడా పాటించలేదని వారు చెబుతున్నారు. ఫలితంగా రోడ్లపై చీలికలు, పొరల విడిపోవడం, గుంతలు ఏర్పడుతున్నాయి.సీసీ రోడ్ల నిర్మాణంలో అత్యంత కీలకమైన ఇరువైపులా వేయాల్సిన బెర్మ్‌లు వేయకుండా వదిలేయడం వల్ల రోడ్ల అంచులు బలహీనపడుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వర్షపు నీరు రోడ్ల కిందికి చేరి మట్టిని కుదేలుచేయడంతో రోడ్లు మరింత త్వరగా దెబ్బతింటున్నాయి.ఇంకా నిర్మాణ పనులు సరిగా చేయకపోవడంతో రోడ్లు సూటిగా కాకుండా వంకర టింకరగా కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల రోడ్డు ఎత్తు తేడాలు ఉండటం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండి మరింత నష్టం కలిగించే పరిస్థితి ఏర్పడుతోంది.కాంక్రీట్ రోడ్ల నిర్మాణంలో తప్పనిసరిగా చేయాల్సిన క్యూరింగ్ ప్రక్రియ (నీటితో తడపడం) సరైన విధంగా చేపట్టకపోవడం కూడా బీటలు పడటానికి ప్రధాన కారణమని ప్రజలు చెబుతున్నారు. నిర్మాణం పూర్తైన తర్వాత కనీసం 1015 రోజులు నిరంతరం నీటితో తడపాల్సి ఉండగా, అటువంటి చర్యలు తీసుకోలేదని వారు విమర్శిస్తున్నారు.పనుల నాణ్యతపై ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు పనులు పూర్తయ్య సమయంలో సాంకేతిక తనిఖీలు నిర్వహించారా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి రోడ్లు నిర్మాణం సమయంలో నాసిరకం పదార్థాలు ఉపయోగించారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు త్వరగా ముగించేందుకు నిబంధనలను పక్కన పెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల సౌకర్యాలు దృష్టిలో పెట్టుకోవలసిన కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణి వల్ల ఇటువంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందంటూ ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే కొద్ది రోజుల్లోనే రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసం అయ్యే ప్రమాదం ఉంది. నాణ్యత లోపాలు తో రోడ్లు నిర్మించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ పై శాఖాపరమైన



విచారణ చేపట్టి కాంట్రాక్టర్ పై తక్షణ చర్యలు చేపట్టాలని దెబ్బతిన్న రోడ్ల ను ప్రమాణాలకు అనుగుణంగా మళ్లీ తిరిగి నిర్మించాలని స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి పరిణామాలు ఎదురుకాకుండా కఠిన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## ఘనంగా శ్రీశ్రీశ్రీ సిరుల ఎల్లమ్మ తల్లి సిరి మానోత్సవం

అక్షర విజేత మెంటాడ: మండలంలోని పెద మేడపల్లి గ్రామంలో బుధవారం శ్రీశ్రీశ్రీ సిరుల ఎల్లమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు ఈ జాతరకు యువత, మహిళలు ఉత్సాహంగా. జిల్లా నరుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బుధవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి భక్తులు ముడుపులు చెల్లించారు. వాస్తవానికి గ్రామ దేవతలు పండగలకు భిన్నంగా ఎల్లమ్మ తల్లి పండుగ నిర్వహిస్తారు. అమ్మవారికి విన్నవించుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల యొక్క ప్రగాఢ నమ్మకం. ఎవరైనా కోరిన కోరికలు నెరవేరితే అమ్మవారికి కోళు ్ల, మేకపోతులు నైవేద్యంగా ఇచ్చి అమ్మవారి ఆశీస్సులు తీసుకుంటారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కిలోమీటర్ పైన బొమ్మల కొలువులు, రంగులరాట్నం వంటి అనేక పిల్లలను ఆకర్షించే సర్కస్, బాణసంచా వంటి వి తీర్థంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులను విశేషంగా ఆకట్టుకునే సినిమానోత్సవములో అన్ని రసవత్ర ఘట్టాలే 30 అడుగుల పొడవున్న సిరిమాను ఉపరితలంలో బిగించే ఇరుసుపై ప్రధాన



పూజారి విసనకర్ర చేతపట్టి ఆశీనులవుతారు. భక్తులను ఆశీర్వదిస్తూ గగన తలం లో ఇరువైపులా త్రిప్పుతారుతారు రెండు చివరి రథం పై అమర్చిన ఇరుసును మానుకు అమర్చుతారు దాని ఆధారంగానే మాను పైకి లేస్తుంది. గ్రామ పెద్దలు, యువత, తాడు లాగడంతో ప్రారంభమయ్యే సిరిమాను ఊరేగింపు సాయంత్రం ఐదు గంటలకు డప్పుల వాయిద్యాలతో ఆలయ పూజారి అధిరోహించిన సినిమాను ఊరు చివరి మర్రి చెట్టు వద్ద నుంచి ప్రధాన వీధుల మీదగా అమ్మవారి ఆలయం వరకు మూడుసార్లు సినిమాను రథం తిరుగుతుంది

. సిరిమాను వెంట ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు,భక్తులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని సిరిమాను పైకి , అరటి పండ్లు, దుంప ముక్కలు విసిరి అమ్మవారి పట్ల తమ భక్తినిచాటు కుంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అంద్ర ఎస్సై కె. సీతారాం ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



# మంగళగిరిలో జనసేన ఎదగకుండా ఉండేందుకు చాలా శక్తులు కృషి చేస్తున్నాయి.

## -వారికి మా పార్టీలోనే కొందరు నేతల మద్దతు ఉంది.-జనసేనలో సభ్యత్వం లేని వారికి నామినేటెడ్ పదవులు -లోపాలను ఎత్తి చూపినందుకే నన్ను పదవి నుంచి తప్పించారు -జనసేన పార్టీ నాయకులు కాపరౌతు సుందరయ్య

విజేత మంగళగిరి

జనసేన పార్టీని మంగళగిరి నియోజకవర్గంలో ఎదగనీయకుండా ఉండేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆ పార్టీ నాయకులు కాపరౌతు సుందరయ్య అన్నారు. అటువంటి వారికి జనసేన పార్టీలోని కొందరు మద్దతిస్తున్నారని ఆరోపించారు బుధవారం మధ్యాహ్నం మంగళగిరిలోని ప్రెస్ క్లబ్ నందు సుందరయ్య విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుందరయ్య మాట్లాడుతూ, జనసేన పార్టీలో సభ్యత్వం లేని వారికి, మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డ్, వ్యవసాయ మార్కెట్ కమిటీలలో నామినేటెడ్ పదవులు వరించాయని విమర్శించారు. 2014 నుంచి జనసేన పార్టీలో పనిచేస్తున్న వారికి పదవులు దక్కలేదని, 2024లో ఎన్నికల తర్వాత వైసిపి నుండి పార్టీలోకి వచ్చిన వారికి సభ్యత్వం లేని వారికి పదవులు రావటం దుర్మార్గమని అన్నారు. దీనికి కేవలం నాయకత్వం పైనే తమకు అనుమానం కలుగుతుందని పేర్కొన్నారు. రోజు వారి పార్టీ కార్యక్రమాల్లో ఇంచార్జ్ తప్ప మిగిలిన నాయకులు వేదికపై కనిపించరని తెలిపారు. సమాచారం లేకనే నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరమవుతున్నారని అన్నారు. కొందరి నాయకుల వలన మంగళగిరిలో జనసేన పార్టీ ఎదుగు, బొద్దుగూ లేకుండా పోయిందని తెలిపారు.

**లోపాలను ఎత్తి చూపినందుకు పదవి నుంచి తప్పించారు**

జనసేన పార్టీలో ఉన్న లోపాలను ఎత్తి చూపినందుకు తనను ఎర్రబాలెం గ్రామ అధ్యక్ష పదవి నుంచి తప్పించారని సుందరయ్య తెలిపారు. గత ఎన్నికల్లో ఎర్రబాలెం గ్రామంలో 5 వేల రికార్డు మెజార్టీ వచ్చిందంటే తాము కృషికి నిదర్శనమని అన్నారు. స్థానిక నాయకులను చూసి కాదని కేవలం జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం పని చేస్తున్నామని తెలిపారు.

**కాపులకు పదవుల్లేవు!**

మంగళగిరి జనసేన పార్టీలో కాపు సామాజిక వర్గం వారు పార్టీ అభివృద్ధికి వెన్నెముకగా ఉన్నారని తెలిపారు. అయినప్పటికీ కాపు సామాజిక వర్గ నేతలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం దక్కలేదని తెలిపారు. ఇదే విషయాన్ని తామంతా త్వరలో అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలనుకుంటున్నట్లు చెప్పారు.

**లోకేష్ లక్ష మెజార్టీతో గెలుస్తారని ముందే చెప్పా.**

నారా లోకేష్ కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న సమయంలో 2024 జనవరిలో ఓ మీడియా ఛానల్ ఇంటర్వ్యూలో తాను మాట్లాడానని సుందరయ్య తెలిపారు. నారా లోకేష్ మంగళగిరి శాసనసభ్యునిగా లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని చెప్పిన ఏకైక వ్యక్తిని తానేనని అన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ బాధ్యతలు చేపట్టి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తో కలిసి అనేక ప్రయోజనాత్మక కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఆటవిడుపు కోసం కొలంబో వెళ్లి భారత్ పాకిస్తాన్ మ్యాచ్ ను వీక్షిస్తే దీనిని సైతం వైసీపీ నేతలు రాజకీయం చేసి అవాకులు, చవాకులు పేలుతున్నారని అన్నారు. టిడిపి జనసేన నేతలపై తప్పుడు ప్రచారం చేయటం వల్ల 151 సీట్లు నుంచి 11 సీట్లకు వైసీపీ పరిమితమైందని అన్నారు. అయినప్పటికీ వారి వైఖరిలో మార్పు రాలేదని తెలిపారు.

**వారి పేర్లు త్వరలో వెల్లడిస్తా**

జనసేన పార్టీ మంగళగిరిలో ఎదగకుండా ఉండేందుకు



కారణమైన నాయకుల పేర్లు త్వరలో వెల్లడిస్తానని సుందరయ్య స్పష్టం చేశారు. కేవలం ఇంచార్జ్ కు తొత్తులుగా వ్యవహరించే వారికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితి ఉందని తెలిపారు. మిగిలిన వారికి కనీసం పార్టీ కార్యక్రమాల సమాచారం కూడా ఉండదని పేర్కొన్నారు. 2014 నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వీర మహిళలకు కనీసం పదవులు లభించకపోవడం బాధాకరమన్నారు

# క్రీడలతోనే ప్రజల ఆరోగ్యం, సంతోషం రెట్టింపు : ప్రత్తిపాటి

## - క్రీడాస్ఫూర్తి పెంచేందుకే ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు

## - ఏపీ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ లో భాగంగా సరదాగా వాలీబాల్ ఆడిన మాజీమంత్రి

విజేత చిలకలూరిపేట

ప్రజలకు క్రీడల్లో ఆసక్తి పెంచి, వారి ఆరోగ్యం, సంతోషాన్ని రెట్టింపు చేయాలన్న సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా క్రీడాపోటీలు నిర్వహించాలనే ఆలోచన చేశారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

విజయవాడలో జరుగుతున్న ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ –2026లో మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా రెండోరోజు ఆయన నరసరావుపేట శాసనసభ్యులు అరవిందబాబుతో జట్టుకట్టి, నక్కాఆనంద్ బాబు, పితాని సత్యనారాయణతో టీమ్ తో సరదాగా వాలీబాల్ ఆడారు. ఆట ముగిసిన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

**ప్రజల్ని ఎల్లప్పుడూ ఆనందాల మూడ్ లో ఉంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం**

కూటమిప్రభుత్వం ప్రజాసంతోషానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల్ని ఎల్లప్పుడూ ఆనందాల మూడ్ లో ఉంచాలన్న లక్ష్యంతోనే పాలకులు రాష్ట్రవ్యాప్తంగా కొండవీడు తరహా ఉత్సవాలను, కోటప్పకొండ వంటి తిరునాళ్లను ఘనంగా



నిర్వహిస్తున్నారని ప్రత్తిపాటి వివరించారు. రాష్ట్రాన్ని హ్యాపీ మోడ్ లో ఉంచేందుకు ప్రజాప్రతినిధుల్ని ప్రభుత్వం ఆటల్లో భాగస్వాములను చేసిందన్నారు. క్రీడల్లో యువతలో ఆసక్తిపెంచాలన్న ఉద్దేశం కూడా



దీనిలో భాగమన్నారు. ప్రజలు సాంకేతిక పరిజ్ఞానం నుంచి ఉపశమనం పొందాలంటే ఈ తరహా క్రీడలే ప్రధాన మార్గమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.



# ఏపీ లెజిస్లేటర్స్ అసెంబ్లీ స్పోర్ట్స్ మీట్‌లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు

విజేత జీలుగుమిల్లి



ఏపీ లెజిస్లేటర్స్ అసెంబ్లీ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం విజయవాడలోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం లో జరిగిన ఎమ్మెల్యేల క్రికెట్ పోటీల్లో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ స్పోర్ట్స్ మీట్ రాష్ట్ర ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించేందుకు, ఆరోగ్యకరమైన క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించేందుకు నిర్వహించబడుతోంది. ఇందులో భాగంగా జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో మంత్రి రాంప్రసాద్ నాయకత్వంలోని జట్టులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సభ్యుడిగా పాల్గొని తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు.మైదానంలో ఉత్సాహంగా ఆడుతూ సహచర ప్రజాప్రతినిధులతో కలసి జట్టు భావనను చాటిచెప్పిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, క్రీడలు ఆరోగ్యానికి ఎంతో అవసరమని, ప్రజాప్రతినిధులు కూడా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా యువతకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనసభ సభ్యులు హాజరై క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# చలో ఐటీడీఏ పాడేరు కార్యక్రమం పై విస్తృత ప్రచారం..




విజేత అరకు లోయ

పీవీ టీజీలకు పీఎం జన్మన్ హౌసింగ్ పథకం కింద పెంచిన లక్ష రూపాయలు నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27వ తేదీన తలపెట్టిన చలో ఐటీడీఏ పాడేరు కార్యక్రమం పై గిరిజన సంఘం విస్తృత ప్రచారం కొనసాగిస్తుంది. బుధవారం బస్కి పంచాయితీ పరిధిలోని గ్రామాలలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు బురిడీ దశరథ్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు, ఇతర గిరిజన సంఘం నాయకులు చలో ఐటీడీఏ కార్యక్రమం పై ముమ్మర ప్రచారం నిర్వహించారు. అనేక దశాబ్దాలుగా అభివృద్ధి కి ఆమడ దూరంలో ఉన్న పివి టీజీలను ఆదుకోవాలని చేసిన పోరాటాలతో మంజూరైన పీఎం జన్మన్ నిధులు విడుదల కాక లబ్ధిదారులు పునాదులు కూడా వేసుకోలేని పరిస్థితిలో ఉన్నారని సిపిఎం గిరిజన సంఘము నాయకులు వాపోయారు. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం అంతంతమాత్రంగా ఉన్న నేపథ్యంలో జన్మను నిధులు సరిపోక, మంజూరైన అదనపు నిధులు విడుదల కాక లబ్ధిదారు రాష్ట్ర కష్టాలు పడుతున్నారని వారన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రస్తుత పెరిగిన ధరలతో పది లక్షల రూపాయల వరకు వ్యయం అవుతుందని ఈ నిధులు ఖర్చు చేయాలంటే పేద పివి టీజీలకు భారమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పీఎం జన్మన్ మంజూరైన నిధులు తక్షణమే విడుదల చేయాలన్న డిమాండ్తో ఈనెల 27వ తేదీన నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని ఆదివాసి గిరిజనలంతా విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం కోసం గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం కొనసాగిస్తున్నామని వారు తెలియజేశారు.

# చిలకలూరిపేటలో జనసేన సభ్యత్వ నమోదు సందడి

## -ప్రధాత మండలనేని చరణ్ తేజ ఆధ్వర్యంలో 'సేనా సిద్ధం'

## -జనసైనికుల కుటుంబ ఆర్థిక భద్రతకు, సేవల గుర్తింపుకు భరోసాగా… 'జనసేన ఉద్యమి !'

విజేత చిలకలూరిపేట:జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా, కార్యకర్తల సంక్షేమం మరియు గుర్తింపు కోసం నియోజకవర్గ యువ నాయకులు ప్రదాత మండలనేని చరణ్ తేజ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 26 నుండి నియోజకవర్గవ్యాప్తంగా "జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు" కార్యక్రమాన్ని భారీ ఎత్తున ప్రారంభించనున్నారు.

**మూడు విభాగాల్లో సభ్యత్వాలు**

**ఉద్యమి, సాధక్, ప్రధాత**

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో, సభ్యులను వారి సేవల ఆధారంగా మూడు కీలక విభాగాలుగా విభజించి గుర్తింపు ఇవ్వనున్నారు.పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని, సిద్ధాంతాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనిచేసేవారు ఈ విభాగం కింద సభ్యత్వం తీసుకోవచ్చు.పార్టీ పోరాటాలకు బలాన్ని చేకూర్చుతూ, కొత్తవారిని ప్రభావితం చేస్తూ, నవతరంలో ప్రేరణ కలిగించి పార్టీలోకి ఆహ్వానిస్తూ సభ్యత్వాలు చేయించే క్రియాశీలక వ్యక్తులు.పార్టీకి పరోక్షంగా ఆర్థిక, సాంకేతిక లేదా మేధోపరమైన సహకారం అందిస్తూ పార్టీ బలోపేతానికి వెన్నుముకగా నిలిచేవారు.

**కుటుంబాలకు ఆర్థిక భద్రత – సేవలకు తగిన గుర్తింపు**

ఈ సభ్యత్వ నమోదు కేవలం గుర్తింపు కార్డులకు మాత్రమే పరిమితం కాకుండా, కష్టపడి పనిచేసే జనసైనికుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రధాన ఉద్దేశమని చరణ్ తేజ పేర్కొన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.యువతకు పిలుపు రేపు అనగా ఫిబ్రవరి 26 నుండి ప్రారంభంనియోజకవర్గంలోని యువత, మార్పును ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని జనసేనాని పవణ్ కళ్యాణ్ ఆశయ సాధనలో భాగస్వాములు కావాలని



మండలనేని చరణ్ తేజ కోరారు. "సేనా సిద్ధం" అంటూ ప్రతి గ్రామంలోనూ, వార్డులోనూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# లిఫ్ట్ ఇరిగేషన్లపై మరోసారి అసెంబ్లీలో గళాన్ని వినిపించిన ఎమ్మెల్యే ఎంజీఆర్.

**వంశధార ప్రాజెక్టుకు భూములు ఇచ్చి రైతులు చాలా నష్టపోయారు.వంశధార, మహేంద్ర తనయ నదులపై అవసరం ఉన్నచోట ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయాలి.**
**మూడు పంటలు పండే పల్లపు భూములు ప్రాజెక్టుకు పోగా శివారు ఉన్న పంట పొలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ లే దిక్కని వివరించిన ఎమ్మెల్యే ఎంజిఆర్.**
**.గత ఐదు సంవత్సరాలు వ్యవసాయం తోపాటు లిఫ్ట్ ఇరిగేషన్లను గాలికి వదిలేసిన వైసిపి ప్రభుత్వం..**
**ప్రస్తుతం ఉన్న ఇరిగేషన్లకు మరమ్మతుల కొరకు నిధులు తోపాటు కొత్త ఇరిగేషన్లను తక్షణమే మంజూరు చేయాలి**

పాతపట్నం
పాతపట్నం నియోజకవర్గం ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని ప్రస్తుతం పంటలు పండక చాలా మంది రైతు కుటుంబాలు చెన్నై, హైదరాబాదు వంటి నగరాలకు వలస వెళ్లి పోతున్నారని అసెంబ్లీలో ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రధానంగా ఉన్న వంశధార, మహేంద్ర తనయ నదులపై అవసరమున్న చోట శివారు ప్రాంతాలకు కూడా సాగునీరు అందించేందుకు గాను లిఫ్ట్ ఇరిగేషన్లను మంజూరు చేయాలని అసెంబ్లీలో మరోసారి తన గళాన్ని వినిపించిన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ముఖ్యంగా మూడు పంటలు పండిన భూములను వంశధార ప్రాజెక్టుకు రైతులు త్యాగం చేయడం జరిగిందని మిగిలిన శివారు భూములకు వర్షాధారమే దిక్కని కనుక తక్షణమే ప్రభుత్వం స్పందించి వంశధార, మహేంద్ర తనయ నదులపై లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ లను మంజూరు చేస్తూ గత ఐదు సంవత్సరాలు వ్యవసాయాన్ని, ఇరిగేషన్ ప్రాజెక్టులను వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వలన మరమత్తులకు గురైన కారణంగా మన ప్రజా ప్రభుత్వం తక్షణమే స్పందించి పాత ప్రాజెక్టులకు రిపేరుకు నిధులు మంజూరు చేస్తూ కొత్త ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయాలని విన్నవించారు ముఖ్యంగా పాతపట్నం నియోజకవర్గంలో పెద్ద సీది,తిడ్డిమి, సీతారామ పల్లి,



బోరుభద్ర, పెద్దమల్లిపురం తోపాటుగా మరికొన్ని ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయాలని స్పీకర్ ద్వారా సంబంధిత మంత్రివర్యులకు, ప్రభుత్వానికి ఎమ్మెల్యే విన్నవించడం జరిగింది

# శ్రీశ్రీశ్రీ సయ్యదు హజరత్ గోకారమయ్య స్వాముల వారి ఉరుసు మహోత్సవములు

కోడుమూరు
కర్నూలు జిల్లా సి.బెళగల్ మండల, బూరాన్ దొడ్డి గ్రామంలో శ్రీ సయ్యద్ హజరత్ గురువులగు శ్రీ గోకారమయ్య స్వాముల వారి ఉరుసు మహోత్సవము నిర్వహిస్తారు
26.తేదీన గురువారము - గంధము
27-తేదీన శుక్రవారము-ఉరుసు.
28-తేదీన శనివారము-జియారత్ ఉత్సవములు జరుగునని



గ్రామ పెద్దలు తెలియజేశారు. కావున భక్తులందరూ విచ్చేసి శ్రీ గోకారమయ్య స్వాముల వారి నీ ప్రజలు భక్తులు భారీ ఎత్తున పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి, వారి కృపకు పాత్రులగుదురరని గ్రామ పెద్దలు తెలిపారు

# అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

**-సిఐటియు జిల్లా నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి....**

పత్తికొండ
పత్తికొండ:అంగన్వాడి ల సమస్యలను పరిష్కరించాలని కోరుమాండల్ రిలే దీక్షల శిబిరం నుండి ర్యాలీగా వెళ్లి స్థానిక సిడిపిఓ ఆఫీసు నందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా నాయకులు వెంకటేష్ రెడ్డి శ్రీరాములు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోరికలను పరిష్కరించాలని కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అనంతరం ప్రాజెక్టు డైరెక్టర్ విజయ మేడంకు వినతి పత్రం అందించారు కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు గోపాల్ రాముడు ప్రజానాట్యమండలి రమేష్అంగన్వాడీ నాయకురాలు రామాంజనమ్మ పద్మజ రాఘవేంద్రమ్మ లక్ష్మి మాధవి కస్తూరి అంగన్వాడీలు పాల్గొన్నారు.



# రెండవ రోజుకు చేరిన అంగన్వాడీల రిలే దీక్షలు

**-సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ పిఎఫ్ అమలు చేయాలి....**

**-సిఐటియు మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర....**

పత్తికొండ
పత్తికొండ:పత్తికొండ పట్టణంలో కోరమండల్ ముందు అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు రెండవ రోజుకు చేరాయి మంగళవారం రెండవ రోజు దీక్షలో అంగన్వాడి హెల్పర్స్ నాయకురాలు అంజనమ్మ, విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర, మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని గ్రాట్యూటీ పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. రేపటి తరం కోసం నేటి బాలలు వారి తల్లులు సంరక్షణ పనులలో అంగన్వాడీల శ్రమ బాధ్యతలు కీలకంగా మారాయని గర్భిణీలు బాలింతలు , శిశువులు పిల్లల ఆరోగ్యాలను కాపాడటంలో వారికి సమతుల్య ఆహారాన్ని అందించడంలో పిల్లల మనోవికాశాలను మెరుగుపరచడంలో ఐసిడిఎస్ లక్ష్యాలను ముందుకు తీసుకుపోతున్నది అంగన్వాడీ లని ప్రభుత్వం గుర్తించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చట్టం ప్రకారం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు పెండింగ్లో ఉన్న మినీ వర్కర్లు అనుభవాన్ని పరిగణంలోకి తీసుకుని వారిని మెయిన్ వర్కర్లుగా మెయిన్ సెంటర్లుగా మార్చాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు రంగారెడ్డి దస్తగిరి తుగ్గలి మండలం సిఐటియు కార్యదర్శి శ్రీరాములు మద్దికేర



మండలం సిఐటియు కార్యదర్శి బురుజుల రాముడు ప్రజానాట్య మండలి మండల కార్యదర్శి ఎం రమేష్ కాశి రైతు సంఘం నాయకులు రాజుల సారప్ప. ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి హెల్పర్లు లక్ష్మీదేవి ఫక్రున్ బి భూదేవి గాయత్రి అనసూయ అనురాధ లలితమ్మ మీనాక్షమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మూడవరోజుకు చేరుకున్న అంగన్వాడి కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు.

కోడుమూరు
అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి ప్రజా సంఘాల నాయకులు నవీన్ పాటి. మహమ్మద్ ముస్తఫా.. అంగన్వాడి కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మూడవ రోజుకు చేరుకున్నాయి మూడవరోజు దీక్షల సందర్భంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నవీన్ పాటీ. ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ ముస్తఫా గార్లు అంగన్వాడీలకు మద్దతుగా వారు చేస్తున్న పోరాటాలకు సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అంగన్వాడీలు చాలీచాలని జీతాలతో ఉద్యోగాలు చేస్తూ గర్భిణీలు చిన్నపిల్లలు వారి బాగోగులను చూసుకుంటూ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నారు చిన్నపిల్లలు స్కూల్లకు రావడానికి మొదటి మెట్టు అంగన్వాడి కేంద్రాలు అంగన్వాడి హెల్పర్లు ఇండ్లకు తిరిగి సంవత్సరము రెండు సంవత్సరాల పిల్లలను సెంటర్లకు తీసుకొని వచ్చి వారికి పోషకాహారం పెట్టి స్కూలుకు రావడానికి బాటలు వేస్తున్నారు వారి ఆరోగ్యాలను చూసుకుంటున్నారు అలాగే గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందిస్తూ వారికి ఆరోగ్య సూచనలు కూడా అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్నారు బాల్యవివాహాలు జరగకుండా పై అధికారులకు సమాచారాలు ఇవ్వడం వంటి ఎన్నో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూ ప్రభుత్వం చేపట్టినటువంటి అన్ని కార్యక్రమాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా జీవో ప్రకారం ఒక కుటుంబం బతకాలంటే కనీసం 26 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని ఆరోజు కమిటీ సిఫారసు చేసిందిఅయినా పట్టించుకోవడం లేదు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా అంగన్వాడీల సేవలను గుర్తించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ప్రైవేటు పాఠశాలల్లో యూకేజీ ఎల్కేజీ పేరున రెండు సంవత్సరాల పిల్లలని ప్రైవేట్ పాఠశాలలో చేర్పిస్తున్నారు ఇది అరికట్టాల్సిన బాధ్యత



ఈ ప్రభుత్వాలపైన ఉన్నది దీని కారణంగా అంగన్వాడి సెంటర్లలో పిల్లల సంఖ్య తగ్గుతుంది ప్రభుత్వ బడులకు పంపడం కూడా తగ్గిపోతుంది కాబట్టి ప్రభుత్వం దీనిపై ఆలోచించాలి అంగన్వాడీలు చేస్తున్న న్యాయపోరాటానికి మా వంతు సహకారం ఉంటుందని నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు షఫీవుల్లా ఆవాజ్ నాయకులు మహమ్మద్ కాసిం సాహెబ్ మహమ్మద్ రఫీ అబ్దుల్ అజీజ్ సిఐటియు మండల అధ్యక్షుడు జేపీవీరన్న మరి అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు పాల్గొన్నారు

# అనాధ వ్యక్తి మృతి అంత్యక్రియలు నిర్వహించిన పూలే అంబేడ్కర్ఎడ్యుకేషనల్.సొసైటీ మానవతావాదులు.సింగనేటినరసన్న

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 25
యు,వెంకోబులు సామాజిక సేవకులు, యు రాము యం.లచ్చప్ప టీచర్ సహకారం తోపూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న మహారాజ్ డా,కమళే గణేష్ రాష్ట్ర సలహాదారులు,జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు శావల బుజ్జి బాబుమూగతి ప్రతాప్ కుమార్ ఎం ఆర్ పి ఎస్.మంత్రాలయంనియోజకవర్గఇన్చార్జి ,చింపిరి శావల చిన్న పోతప్ప జైభీమ్ఎమ్మార్పీఎస్ నందవరం మండలం అధ్యక్షులు పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ జిల్లాఅధ్యక్షులు సాతర్ల ప్రసాద్ గారు,జే యువరాజ్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్తుతెలియని అనాధ మగ మనిషి శవానికి పూల మాలలు వేసి గోనెగండ్ల బైపాస్ రోడ్ హిందూ స్మశాన వాటికలోఅంత్యక్రియలు నిర్వహించివారు మాట్లాడుతూమంత్రాలయం అర్బన్.కుసంబంధించినటువంటి అనాధ వృద్ధుడు వయసు 58 సం,అనారోగ్యం కారణంతోఆదివారం 22వ తేదీ ఫిబ్రవరి 2026 చనిపోయాడని పోలీసులు తెలిపారు చనిపోయిన వ్యక్తి దగ్గర ఎలాంటి ఆధార కార్డు లేనందున పూర్తి సమాచారం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మార్చురీ ఫ్రీజర్ బాక్స్ లో భద్రపరిచి కేసు నమోదు చేసి ఎంక్వయిరీ చేయగా చనిపోయిన వ్యక్తి యొక్క బంధువులు ఎవరు రాకపోవడంతో ఎమ్మిగనూరు పట్టణంలోని పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న మహారాజ్ కి సమాచారం ఇవ్వగా కమిటీ సభ్యులు,జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు ప్రధాన కార్యదర్శి శవాల. సత్యానందంజై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల అధ్యక్షులుపూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ నియోజకవర్గం అధ్యక్షులు యం, మహానంది టౌన్ ప్రధాన కార్యదర్శి కదిరి కోట సుందర రాజు, ఫరీద్ మట్టి వేసి పూలమాలలతో ఎమ్మిగనూర్ గోనెగండ్ల బైపాస్ రోడ్ హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు










# ఎమ్మిగనూరు జిల్లాను వ్యతిరేకించిన నాయకులు ఎమ్మెల్యే ని ప్రశ్నించే హక్కు లేదు- పట్టణ కోశాధికారి.విజయలక్ష్మి

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 25
ఎమ్మిగనూరు ప్రజల మనోభావాలను అభివృద్ధి ని అడ్డుకున్న పార్టీ లకు ప్రజలు బుద్ది చెప్పడానికి సిద్ధం గా ఉన్నారుఆదోని జిల్లా మరియు ఎమ్మిగనూరు జిల్లా ప్రకటన పై కొంతమంది వైసీపీ నాయకులుమాలమహానాడు నాయకులు అంటూ ఎమ్మెల్యే జిల్లా ప్రకటన కు అనుకూలమా వ్యతిరేకమా అంటూ ప్రెస్ మీట్ పెట్టి ప్రశ్నించడం జరిగింది. ఈ విషయంపై పట్టణ కోశాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ పార్టీలో కనీస గుర్తింపు లేని నాయకులు ఎమ్మెల్యే ని ప్రశ్నించి గుర్తింపు కోసం ఆరాటపడటం ఈ మధ్యకాలంలో కొంతమంది కి ఫ్యాషన్ అయిపోయింది అని ఆమె ఎద్దేవా చేశారు. విమర్శించే ముందు వారి స్థాయిఏంటోతెలుసుకోవాలని ఆమె హితవు పలికారు. చార్ సౌ బీస్ గాళ్ళ ప్రశ్నలకు నేను సమాధానం చెప్తానంటూ ఆదోనిజిల్లాకువ్యతిరేకమంటూ ఎమ్మెల్యే ఎక్కడైనా చెప్పారా అంటూ ఆమె ప్రశ్నించారు. ఎమ్మిగనూరు అన్ని నియోజకవర్గాల కంటే అన్ని అర్హతలు భౌగోళికంగా ఆర్థిక సామాజిక విద్య వైద్యం ఉపాధి వ్యాపారం వాణిజ్యం కి అనువైన ప్రాంతం కాబట్టి ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే ఎమ్మిగనూరు జిల్లా కావాలనుకోవడంలో తప్పులేదని తెలిపారు. ఎమ్మిగనూరు అభివృద్ధిని జిల్లా కేంద్రం ఏర్పాటు ని వ్యతిరేకించిన ప్రతిపక్ష పార్టీ నాయకులు మా ఎమ్మెల్యే ని ప్రశ్నించటం హాస్యాస్పదంగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. ఎమ్మిగనూరు జిల్లా వ్యతిరేకం అంటూ రేపు స్థానిక ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లే దమ్ము మీ పార్టీకి మీకు ఉందా అని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మునిసిపల్ కార్మికుల కారుణ్య నియామకాలను విస్మరిస్తే మా ఎమ్మెల్యే గారు సీఎంతో చర్చించి పట్టుబట్టి పదమూడు మందికి కారుణ్య నియామకాలు తెచ్చిన మొనగాడు మా ఎమ్మెల్యే జయనగేశ్వరెడ్డి అని ఈ విషయం ఏ శాసనసభలో మాట్లాడలేదని మా ఎమ్మెల్యే మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధిని చూపించే వ్యక్తి అని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి గారి దమ్ము ధైర్యము మాకంటే తొమ్మిది సంవత్సరాలు టిడిపి కండువా మోసిన మీకే బాగా తెలుసు అని ఆమె దుయ్యాబేట్టారు. కేవలం గుర్తింపు కోసం ఎమ్మెల్యే పై ప్రెస్ మీట్ లు పెడితే మీ గురించి ప్రెస్మీట్లను ఇతరులు పెట్టాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు.



# ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట్ స్వామిని కలిసిన సదాశివపేట కౌన్సిలర్స్ బృందం

సదాశివ పేట

సదాశివపేట మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్స్ బృందం జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట్ స్వామిని టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి నేతృత్వములో మర్యాదపూర్వకంగా కలిసి వారిని పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైనటువంటి సదాశివపేట పురపాలక సంఘం మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిర్రు, 12 వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు , శజ్జీ భాయ్, గోపి ప్రియాంక, వాజీద్, గారెల గౌరీదేవి తుల్జారామ్, లక్ష్మీ ప్రియ,కుతేజ ఫాతిమ, గౌసియా బేగం, కొత్త గొల్ల లావణ్య, పాతదొడ్డి అనిత, శంకర్ గౌడ్,దుబాయ్ వాజీద్, పట్లూరి రోజా, ఎరుకలనర్సింలు, బేగరి అరుణ్, ఆకుల నిఖిత కౌన్సిలర్స్ అందరూ కలిసి మంత్రి కి పుష్పగుచ్చాన్ని అందించి ధన్యవాదములు తెలియ జేశారు. గెలిచిన కౌన్సిలర్స్ అందరికి జిల్లా మంత్రి వివేక్ నూతన కౌన్సిలర్స్ అందరికి అల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి, మౌలిక



వసతుల విస్తరణ, పెండింగ్‌లో ఉన్న పనుల ఆమోదం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు, స్ట్రీట్‌లైట్లు, పార్కుల అభివృద్ధి వంటి అంశాలకు నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. అలాగే పేదల గృహ నిర్మాణ పథకాలు వేగవంతం చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి వివేక్ వెంకట్ స్వామి స్పందిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం కట్టుబడిఉందని తెలిపారు. ప్రతిపాదించిన పనులను సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో సదాశివపేటకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# పసిబిడ్డను కాలుతో తన్ని హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

¯ సంగారెడ్డి నాగర్ కర్నూల్ తాడూర్ మండలం కుమ్మెర జాతరలో 2నెలల పసిబిడ్డను కాలుతో తన్ని హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డి న్యూ బస్టాండ్ వద్ద ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ కుమ్మెర జాతరలో రజకులు, దళితులపై పాశవికంగా దాడి చేసి రెండు నెలల పసికందును హత్య చేసిన అగ్రకుల పెత్తందారులపై హత్యా కేసు, అట్రాసిటీ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన సభ్య సమాజం సిగ్గు పడేలా ఉన్నదని అన్నారు. పెత్తందారులు బాధిత కుటుంబ సభ్యులను చిత్ర హింసలు పెడుతున్నా పోలీస్ ప్రేక్షక వహించారని అన్నారు.నిందితులను వదిలిపెట్టి,బాధితులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని అన్నారు.



ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిఐ,ఎస్ఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనతో సంబంధం ఉన్న గ్రామ సర్పంచ్ ను వెంటనే సస్పెండ్ చేయాలని అన్నారు.ముఖ్య మంత్రి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.భాదిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆడుకోవాలని అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారికీ సిపిఎం పోరాటం చేస్తున్నదని అన్నారు.ఈ కార్యక్రమం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు యం యాదగిరి, నాయకులు అశోక్, రమేష్ గౌడ్, ఆశన్న గౌడ్,మంజుల,సతీష్, అర్జున్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుక లో పాల్గొన్న సిద్దాపూర్ సర్పంచ్ షరీఫ్

ఝరాసంగం

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలం సిద్దాపూర్ సర్పంచ్ షరీఫ్ బుధవారం జరిగిన వివాహ కార్యక్రమం లో పాల్గొని నూతన వధువు వరులను ఆశీర్వదించారు. ఆయన తో పాటు గ్రామ పెద్దలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా అధ్యక్షులుగా టి రాజేష్ ఎన్నిక

సంగారెడ్డి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సంగారెడ్డి 08 వ జిల్లా మహాసభలు 20, 21తేదీలలో జహీరాబాద్ పట్టణంలో జయప్రదంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ మహాసభలో కోహీర్ మండలం పిచ్చేరాగడి గ్రామానికి చెందిన టి రాజేష్ నీ జిల్లా కార్యదర్శి ఏకగ్రీవంగా ఎనుక్కోవడం జరిగింది. ఈ సందర్భంగా టి.రాజేష్ మాట్లాడుతూ.. నా పై పెట్టిన బాధ్యతను విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తానని అన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని విస్మరించడం సరికాదని అన్నారు.కేంద్ర ప్రభుత్వం కొఠారి కమిషన్ ప్రకారం 10 నిధులు కేటాయించాలనీ,రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని అభివృధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటలు నిర్వహిస్తామన్నారు.



# ఉమెన్ ఎంపవర్ మెంట్ జాతీయ స్థాయి ట్రైనింగ్ కు ఎంపికైన..... జీర్ల పల్లి సర్పంచ్ అమరేశ్వరి శివమణి

ఝరాసంగం )

ఝరాసంగం మండలం జీర్ల పల్లి సర్పంచ్ అమరేశ్వరి శివమణి ఉమెన్ ఎంపవర్ మెంట్ జాతీయ స్థాయి ట్రైనింగ్ కు ఎంపిక అయింది. జీర్ల పల్లి సర్పంచ్ అమరేశ్వరిశివమని ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఇట్టి కార్యక్రమానికి మన సంగారెడ్డి జిల్లా నుండి అయిదు గురు సర్పంచ్ లు ఎన్నికయ్యారు ఇంత తక్కువ టైమ్ లొ గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వచ్చిన అమరేశ్వరి కి గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఉన్నతమైన విద్యనభ్యసించి గ్రామ ప్రజలను సేవ చేయాలను ఉద్దేశంతో సర్పంచ్ గా ఎన్నికై గ్రామ ప్రజలకు అనునిత్యం సేవలు చేస్తున్న సర్పంచ్ అమరేశ్వరి శివమణి ఇలాంటి ఉన్నతమైన పదవులు మరెన్నో ఎంపిక కావాలని ఆశభావం వ్యక్తం చేశారు.




# ఉపాధి హామీ పనులు తనిఖీ చేసిన సర్పంచ్ బానోత్ సుభాస్

ఝరాసంగం

ఝరాసంగం మండల పరిధిలోని భోజ్య నాయక్ తండా లో ఉపాధి హామీ పనులను తనిఖీ చేసి పరిశీలించిన సర్పంచ్ బానోత్ శుభాష్ పీల్డ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల చేత మట్టి పూడిక పనులు చేస్తున్న విషయం



తెలుసుకొని ఉపాధి హామీ పనుల నాణ్యనతను తనిఖీ చేసి పరిశీలించిన సర్పంచ్ సుభాస్, ఎపి ఓ రాజు కుమార్ తో కలిసి పనులను పరిశీలించారు అనంతరం వారు మాట్లాడుతూ కరువు కాలంలో ఉపాధి హామీ కూలీలకు ఆర్థికంగా చేదోడుగా ఉంటాయని తెలిపారు.ఉపాధి హామీ పనులు జాబ్ కార్డు ఉన్న అందరు చేసుకోవచ్చుని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు

# కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో వికలాంగుల సంక్షేమానికి 5 శాతం నిధులు కేటాయించాలి

సంగారెడ్డి

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో వికలాంగుల సంక్షేమనికి 5 శాతం నిధులు కేటాయించాలని, పెన్షన్ 6000 లకు పెంచి వెంటనే అమలు చేయాలని ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య డిమాండ్ చేశారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అడిషనల్ కలెక్టర్ పాండు కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ధర్నాను ఉద్దేశించి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వికలాంగుల సంక్షేమనికి 1669. 72 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు.నిధుల కేటాయింపులో కేంద్రశీ నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు.2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టె బడ్జెట్లో వికలాంగుల సంక్షేమనికి నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం మర్చి 20 నాడు ప్రవేశపెట్టే బడ్జెట్లో వికలాంగుల సంక్షేమనికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాల నుండి ప్రభుత్వం కేటాయించిన నిధులు విడుదల చేసి ఖర్చు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ఉందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్బంగా ఇచ్చిన హామీల అమలు కోసం నిధులు ఎందుకు పెంచడం లేదని అన్నారు.

చేయూత పెన్షన్స్ పెంపు కోసం బడ్జెట్లో నిధులు కేటాయించి, పెన్షన్స్ పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 26 నెలలు పూర్తివుతున్న పెన్షన్స్ పెంచడం లేదని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు సహాయ పరికరాల పంపిణి కోసం లబ్ధిదారుల జాబితాలు తయారు అయ్యాయని ఎందుకు పరికరాలు పంపిణి చేయడం లేదని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరనికి చెందిన పరికరాలు పూర్తిస్థాయిలో పంపిణి చేయకుండానే 2025-26 ఆర్థిక సంవత్సరనికి దరఖాస్తులు స్వీకరించడం సరైంది కాదని అన్నారు.ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.విబి జిరామ్జి బిల్లు రద్దు చేసి నరేగా చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వికలాంగులపై దాడులు, దౌర్జన్యాలు, వేధింపులు పెరిగిపోతున్నాయని అన్నారు. వాటినీ అరికట్టెందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం బస్వరాజుపాటిల్ , కొనింటి నర్సిములు మాట్లాడుతూలి జిల్లాలో పరికరాలు పంపిణి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.పెన్షన్స్ పంపిణి చేయడంలో జిల్లాలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.కొత్త పెన్షన్స్ కోసం దరఖాస్తు చేసిన వారికి ఎందుకు మంజూరు చేయడం లేదని అన్నారు.ప్రభుత్వ కార్యాలయలలో ర్యాంపులు లేకపోవడం వలన వికలాంగులు ఇబ్బంది పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. జిల్లాలో ఉన్నా ప్రయివేట్ పరిశ్రమాల్లో నిరుద్యోగ వికలాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.సదరం క్యాంపు నిర్వహణలో వస్తున్న సమస్యలను ఎందుకు పరిష్కారం చేయడం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, పి మేరీ, జిల్లా ఉపాధ్యక్షులు లలిత, రాంచందర్, వెంకన్న, రాములు,రాజ్ కుమార్,సహాయ కార్యదర్శులు కృపవరం,కుమ్మరి నర్సిములు, నవీన్ చారి, శంకర్ నాయక్,జిల్లా నాయకులు అంజమ్మ, పవన్, మల్లమ్మ, జయమ్మ, జలందర్ తదితరులు పాల్గొన్నారు.





## లేలేత మెరుపులతో మంత్రముగ్ధుల్ని చేస్తున్న రుక్మిణీ!

కొత్త నీరు వస్తే పాత నీరు పోతుంది అనేది ఎంత వాస్తవమో.. కొత్త హీరోయిన్లు వచ్చేసరికి పాత వాళ్ళ క్రేజ్ తగ్గుతుందనే కామెంట్లు కూడా అంతే వినిపిస్తూ ఉన్నాయి. అయితే ఈ కొత్త హీరోయిన్లు కూడా తమ లేలేత మెరుపులతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. సినిమాలలోకి అడుగుపెట్టి తమ అందంతో ప్రేక్షకులలో ఒక ఉనికిని సంపాదించుకుంటూనే.. ఇంకొక వైపు నటనతో విశ్వరూపం చూపించే ప్రయత్నం చేస్తున్నారు.అటు సోషల్ మీడియాలో కూడా యాక్టివ్ గా ఉంటూ.. ఫాలోవర్స్ ను పెంచుకుంటూ బ్రాండ్ ప్రమోటర్స్ గా కూడా మారుతున్నారు. ఇదిలా ఉండగా 2024లో నిఖిల్ సిద్ధార్థ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది రుక్మిణి వసంత్. అంతకుముందు కన్నడలో నటించిన ఈమెకు మంచి గుర్తింపు లభించింది కానీ ఈ తొలి తెలుగు చిత్రంతో పెద్దగా గుర్తింపు సంపాదించుకోలేకపోయింది. ఆ తర్వాత ఏ. ఆర్.మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా మదరాసి సినిమాతో తమిళ్ ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ ఎప్పుడైతే రిషబ్ శెట్టి తన కాంతారా చాప్టర్ 2 సినిమాలో అవకాశం కల్పించారో అప్పటినుంచి ఈమె వార్తల్లో నిలుస్తూ వచ్చింది. ఇక సినిమాలో తన అద్భుతమైన నటనతో విశ్వరూపం చూపించింది ఈ ఒక్క సినిమాతో ఏకంగా పాన్ ఇండియా స్థాయి గుర్తింపును సొంతం చేసుకుందని చెప్పవచ్చు. ఇకపోతే ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికంటే ముందే ఈమె ఎన్టీఆర్ – ప్రశాంత్ కాంబినేషన్లో వస్తున్న డ్రాగన్ సినిమాకి కూడా సైన్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా విక్రమ్ కొడుకు ధృవ్ విక్రమ్ హీరోగా వస్తున్న సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఈమె.. మరొకవైపు నాగచైతన్య కొత్త సినిమాలో కూడా అవకాశం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అలాగే గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో హీరో యష్ నటిస్తున్న టాక్సిక్ సినిమాలో కూడా రుక్మిణి వసంత్ కీలకపాత్ర పోషిస్తుంది . ఇలా భారీ ప్రాజెక్టులలో అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిన రుక్మిణి మరొకవైపు సోషల్ మీడియాలో ఫాలోవర్స్ కు దగ్గర అయ్యే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగానే తాజాగా సింపుల్ లుక్ లో లేత అందాలను చూపిస్తూ అభిమానులను మెస్మరైజ్ చేసింది. సింపుల్ అవుట్ఫిట్ తో అందాలు మొత్తాన్ని దాచేస్తూ లేత మోముతో అభిమానులను ఆకట్టుకుంది. ఇక రుక్మిణి వసంత్ తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా .. అమ్మడి అందానికి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాజాగా రుక్మిణి వసంత్ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నాయి

## ముందుచూపు తప్పనిసరి అంటోన్న మిల్కీ బ్యూటీ



గ్లామర్ ప్రపంచంలో వెలుగులు ఎప్పటికీ నిలవవని, స్టార్‌డమ్ శాశ్వతం కాదని టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా చేసిన తాజా వ్యాఖ్యలు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అవకాశాలు వరుస పెడుతున్నప్పుడే ఫ్యూచర్ గురించి ఆలోచించాలి, లేకపోతే కెరీర్ చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు తప్పవని ఆమె స్పష్టం చేయడం సినీ ఇండస్ట్రీ రియాలిటీకి ఒక రియల్ చెక్‌లా మారింది. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూసుకోవాలి 15 ఏళ్ల వయసులోనే వెండితెరకు పరిచయమైన తమన్నా గత రెండు దశాబ్దాలుగా అగ్ర హీరోల సరసన నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అయితే ఈ ప్రయాణం కేవలం గ్లామర్, హిట్ సినిమాల వరకే పరిమితం కాలేదని ఆమె చెబుతున్నారు. చేతి నిండా సినిమాలు ఉన్నప్పుడే సంపాదనను సరైన దిశలో మళ్లించాలని, నటీనటుల కెరీర్ ఎప్పుడెప్పుడు మలుపు తిరుగుతుందో చెప్పలేమని, కాబట్టి ముందుగానే ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ఏర్పరుచుకోవాలంటూ ఆమె చెప్పిన మాటలు ఇండస్ట్రీలోని అస్థిరతను స్పష్టంగా చూపిస్తున్నాయి. అవకాశాలు తగ్గాక ఆర్థిక సమస్యలు తప్పవు సినిమా రంగం వెలుగుల ప్రపంచమే అయినా, అవకాశాలు తగ్గిన తర్వాత చాలామంది కళాకారులు ఎదుర్కొనే ఆర్థిక సమస్యలు కొత్తవి కావు. ఒకప్పుడు టాప్‌లో ఉన్నవారు కూడా తరువాతి కాలంలో ఇబ్బందులు పడిన సంఘటనలు చాలానే చూశాం. ఈ నేపథ్యంలో తమన్నా చేసిన వ్యాఖ్యలు యువ నటీనటులకు హెచ్చరికలా మారాయి. కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడే ఫ్యూచర్ కోసం బలమైన ఆర్థిక ప్రణాళిక అవసరమని ఆమె సూచిస్తున్నారు. ూశ్రీంశీ =ముఃు – ప్రేమకథలతో యంగ్ హీరోకి పరీక్ష పెడుతున్న డైరెక్టర్లు తండ్రి వల్లే ఈ క్రమశిక్షణ అయితే తనకు ఈ దూరదృష్టి రావడం వెనుక తన తండ్రి పాత్ర ఎంతో కీలకమని తమన్నా స్పష్టం చేశారు. ఇండస్ట్రీలోకి వచ్చిన తొలి రోజుల నుంచే తన ఆర్థిక వ్యవహారాలన్నీ తన తండ్రే చూసుకున్నారని.. ఖర్చు, పొదుపు, పెట్టుబడుల విషయంలో ఆయన చూపిన క్రమశిక్షణే తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని తమన్నా పేర్కొన్నారు. తన తండ్రి నేర్పిన పాఠాలే తనను రియల్ ఎస్టేట్, జ్యువెలరీ బిజినెస్ లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా చేశాయని, కుటుంబం నుంచి వచ్చిన మార్గనిర్దేశమే తనకు భరోసానిచ్చిందని తమన్నా వెల్లడించారు పలు వ్యాపారాల్లో తమన్నా పెట్టుబడులు ప్రస్తుతం యాక్టింగ్ తో పాటు సొంతంగా జ్యుయలరీ బిజినెస్ ను రన్ చేస్తున్న తమన్నా, కెరీర్ ఎంత బిజీగా ఉన్నా ఆర్థిక ప్రణాళిక విషయంలో రాజీ పడనని చెబుతున్నారు. ఇండస్ట్రీలో మంచి ఫామ్ ఉన్నప్పుడే ఫ్యూచర్ కోసం పునాది వేసుకోవాలని తమన్నా ఇచ్చిన మెసేజ్ కేవలం నటీనటులకే కాదు, అన్ని రంగాల వారికి కూడా వర్తించేదే. స్టార్‌డమ్ కంటే స్థిరమైన భవిష్యత్తే ముఖ్యమని ఆమె వ్యాఖ్యలు మరోసారి గుర్తుచేశాయి.

## దక్షిణాఫ్రికాతో ఓడిపోవడం మనకు మంచిదే: - రవిశాస్త్రి



టీ20 వరల్డ్ కప్ టోర్నీలో సూపర్–8 పోరులో దక్షిణాఫ్రికా చేతిలో భారత జట్టు పరాజయం పాలవడంపై భారత మాజీ క్రికెటర్, మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఓటమి ఒక రకంగా జట్టుకు మేలు చేసేదేనని ఆయన అన్నారు. ఒకవేళ భారత్ ఈ మ్యాచ్ గెలిచి ఉంటే, అదే అతివిశ్వాసంతో టోర్నమెంట్‌లో ముందుకు వెళ్లేదని, అది భవిష్యత్తులో కీలక సమయంలో మరెంత పెద్ద ప్రమాదానికి దారితీసేదేమోనని ఆయన విశ్లేషించారు. ఈ తొలి మ్యాచ్‌లోనే జట్టులోని లోపాలు, నెగిటివ్ పాయింట్లు అన్నీ బయటపడటం శుభపరిణామమని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారుదక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన ఈ పరాజయంపై సూర్యకుమార్ యాదవ్ సేన గట్టి కసరత్తు చేయాలని ఆయన సూచించారు. అసలు ఏ ఏ రంగాల్లో భారత్ విఫలమైంది, ఎక్కడ మెరుగుపడాలి, కొత్త ప్లేయర్ల అవసరం ఉందా? లేదా? అనే అంశాలపై కోచ్ గౌతమ్ గంభీర్ జట్టును ముందుండి నడిపించాలని అన్నారు. పాత తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకుంటేనే టీమ్ ఇండియా ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలవడం సాధ్యమవుతుందని శాస్త్రి స్పష్టం చేశారు. ఈ ఓటమి నుంచి నేర్చుకున్న పాఠాలతో తదుపరి మ్యాచ్‌లలో భారత్ సత్తా చాటాలని ఆయన ఆకాంక్షించారు.మరోవైపు, సూపర్–8లో మొదటి మ్యాచ్ ఓడిపోయిన భారత్ ముందరి బాట అంత సులభంగా ఏమీ లేదు. రేపు చెన్నై వేదికగా జింబాబ్వేతో జరగనున్న మ్యాచ్ భారత్‌కు చావో రేవో లాంటిది. ఆ తర్వాత మార్చి ఒకటో తేదీన బలీయమైన వెస్టిండీస్‌తో తలపడాల్సి ఉంది. సెమీఫైనల్ రేసులో నిలవాలంటే ఈ రెండు మ్యాచ్‌లలోనూ విజయం సాధించడం భారత్‌కు అనివార్యం. లేనిపక్షంలో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించే ముప్పు పొంచి ఉంది. ప్రస్తుతం రవిశాస్త్రి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి

## అతిగా ఆలోచించవద్దు..

### –టీమిండియాకు పాంటింగ్ సూచన

-దక్షిణాఫ్రికాతో ఓటమి తర్వాత టీమిండియాకు పాంటింగ్ కీలక సూచనలు

-మ్యాచ్-అప్‌ల గురించి అతిగా ఆలోచించడం మానేయాలని హితవు

-అక్షర్ పటేల్‌ను పక్కనపెట్టడాన్ని ప్రశ్నించిన ఆసీస్ మాజీ కెప్టెన్

-చెన్నై మ్యాచ్‌లో పరిస్థితులకు తగ్గ అత్యుత్తమ జట్టును ఎంపిక చేయాలని సలహా

-రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తిరిగి జట్టులోకి తీసుకురావాలని సూచన



టీ20 ప్రపంచకప్ సూపర్–8లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 76 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ భారత జట్టు యాజమాన్యానికి కీలక సూచనలు చేశాడు. ప్రత్యర్థి జట్టులోని బ్యాటర్లను బట్టి (మ్యాచ్–అప్స్) తుది జట్టును ఎంపిక చేసే వ్యూహాన్ని పక్కనపెట్టి, అత్యుత్తమ పదకొండు మందితో బరిలోకి దిగాలని ఆయన హితవు పలికాడు.నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉన్నారనే కారణంతో వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకున్నారు. అయితే, ఈ వ్యూహం పూర్తిగా విఫలమైంది. తొలుత దక్షిణాఫ్రికా 187 పరుగులు చేయగా, ఛేదనలో భారత జట్టు 111 పరుగులకే కుప్పకూలింది. ఈ ఓటమితో టోర్నమెంట్‌లో భారత్ తొలి పరాజయాన్ని చవిచూసింది.ఈ నేపథ్యంలో 'ది ఐసీసీ రివ్యూ' కార్యక్రమంలో పాంటింగ్ మాట్లాడుతూ... "ప్రత్యర్థి జట్టులో లెఫ్ట్ హ్యాండర్లు ఉన్నారనే కారణంతో అక్షర్‌ను ఆడించలేదని కామెంటరీలో చెప్పారు. కానీ, జట్టులో రైట్ హ్యాండర్లు కూడా ఉన్నారు కదా. సరైన సమయంలో అక్షర్‌ను ఎలా ఉపయోగించుకోవాలనేది కెప్టెన్ నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది" అని వ్యాఖ్యానించాడు. కేవలం మ్యాచ్–అప్‌ల కోసం కీలక ఆటగాడిని పక్కనపెట్టడం సరైన నిర్ణయం కాదని ఆయన అభిప్రాయపడ్డాడు.ఈ ఓటమి భారత నెట్ రన్ రేట్‌పై తీవ్ర ప్రభావం చూపింది. సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే మిగిలిన మ్యాచ్‌లలో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తదుపరి చెన్నైలో జరగనున్న మ్యాచ్‌లో భారత జట్టు ప్రాథమిక అంశాలపై దృష్టి సారించాలని పాంటింగ్ సూచించాడు. "నేనైతే పరిస్థితులకు తగిన అత్యుత్తమ జట్టు ఏది అని మాత్రమే ఆలోచిస్తాను. అందులో అక్షర్ పటేల్ ఉన్నా ఫర్వాలేదు. లేదా కుల్దీప్ యాదవ్‌ను తిరిగి తీసుకురావడం గురించి కూడా ఆలోచిస్తాను. ఎందుకంటే రిస్ట్ స్పిన్నర్ అయిన కుల్దీప్‌కు లెఫ్ట్, రైట్ హ్యాండర్లతో సంబంధం లేదు. అతను ఇద్దరినీ ఇబ్బంది పెట్టగలడు" అని పాంటింగ్ విశ్లేషించాడు

## అందగత్తెను పట్టించుకోని అదృష్టం!



ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు .. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ – సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.